
సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

ఆదివారం

22.12.2024



# యువతలో
# బ్రెయిన్ స్ట్రోక్ ముప్పు

## చైర్మన్‌తో ముఖాముఖి



**నూకారపు సూర్యప్రకాశరావు**
**చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య**

**తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు- మ్యుటేషన్ల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వం 2020లో తీసుకొచ్చిన ధరణి పోర్టల్ పేరను భూ భారతిగా మార్పు చేశారు. ఈ మేరకు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ భూ భారతి ఆర్వోఆర్-2024 బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీని గురించి కాసింత చెప్పండి.**

**ఆలుగోలు మన్మధరావు, హైదరాబాద్**

అవును మన్మధ్ గారూ కొత్త చట్టం అమల్లోకి వచ్చిన మూడు నెలల్లోగా మార్గదర్శకాలను రూపొందించనున్నారు. అనంతరం చట్టంలోని సెక్షన్లు అమల్లోకి వస్తాయి,. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను తీర్చే విధంగా కొత్త చట్టం ఉంటుంది.. ఆర్వోఆర్-2024 చట్టానికి (భూ భారతి), ప్రస్తుత ఆర్వోఆర్-2020 (ధరణి) చట్టానికి అనేక వ్యత్యాసాలు ఉన్నాయి . 18 రాష్ట్రాల ఆర్వోఆర్ చట్టాలను పరిగణనలోకి తీసుకుని కొత్త ఆర్వోఆర్ చట్టాన్ని తీసుకొచ్చినట్లు అధికార వర్గాలు చెపుతున్నమాట. ఇన్నాళ్లు ధరణి పోర్టల్‌లో భూ సమస్యలకు సంబంధించి దర ఖాస్తు చేసుకోవడానికి 33 మాడ్యూళ్లు ఉండేవి. ఒక్కో సమస్యకు ఒక్కో మాడ్యూల్‌ను ఏర్పాటు చేశారు. అయితే అవగాహన లేకపోవటం వల్ల రైతులు ఒకదానికి బదులు మరో మాడ్యూల్లో అప్లికేషన్ పెట్టుకుంటే రిజక్ట్ చేసేవారు. దీంతో ప్రతిసారీ రూ.1,200 వెచ్చించి పదేపదే దరఖాస్తు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఈ మాడ్యూళ్ల సంఖ్యను ఆరుకు తగ్గించారు. భూ భారతి పోర్టల్లో దరఖాస్తు చేస్తే ఇకపై భూ యజమాని ఫోన్ నంబరుకు ఎస్ఎంఎస్‌లు వస్తాయి. రైతుల అప్లికేషన్ స్టేటస్ చూసుకునేలా ట్రాకింగ్ వ్యవస్థ ఉంటుంది. ధరణి పోర్టల్లో భూ దస్త్రాలు కనిపించేవి కావు. భూ భారతిలో ఎవరివైనా, ఎక్కడి నుంచైనా భూముల వివ రా లు చూసేలా ఏర్పాట్లు ఉంటాయి.

2020కి ముందు 32 కాలమ్‌లతో పహాణీ ఉండేది. అందులో భూ యజమాని పేరు, భూ ఖాతా, సర్వే నంబరు ఇలా 32 కాలమ్‌లు ఉండేవి. ధరణి పోర్టల్ ద్వారా రైతు పేరు మాత్రమే ఉండేలా పహాణీని అమలు చేసింది. ఈ క్రమంలో భూముల వివరాల లభ్యత లేక రైతులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుత అవసరాలకు తగినట్లుగా భూ భారితిలో 11 కాలమ్‌లతో కొత్త పహాణీని ఏర్పాటు చేశారు. ఎమ్మార్వో స్థాయిలో భూ సమస్య పరిష్కారం కాకపోతే ఆపైన ఆర్డీవోకు, అక్కణ్నుంచి కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చు. కలెక్టర్ ఇచ్చే ఉ త్తర్వులతో విభేదిస్తే 30 రోజుల్లో భూ పరిపాలనా ట్రైబ్యునల్‌లో సవాల్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. లీగల్ ఇష్యూస్ పరిష్కారానికి ల్యాండ్ ట్రైబ్యునళ్లు సైతం ఏర్పాటు చేస్తారు. భూ పరిపాలన ట్రైబ్యునల్ కమిషన్‌ను ప్రభుత్వం నియమిస్తుంది.

భూ సమస్యల విషయాల్లో రైతులకు న్యాయ సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సర్కార్ మం డల స్థాయిలో వాలంటీర్లను ఏర్పాటు చేయనుంది. పేదలకు పైసా ఖర్చు లేకుండా ఉచితంగా న్యాయ సలహాలు అందిస్తారు. 2017-18లో నాటి ప్రభుత్వం చేపట్టిన భూ దస్త్రాల ప్రక్షాళన సందర్భంగా చిన్న చిన్న సమస్యలతో పక్కన పెట్టిన 18 లక్షల ఎకరాల భూములకు స్పష్టత తీసుకురానున్నారు. హక్కుల జారీకి భూ భారతి చట్టం ద్వారా అవకాశం కల్పించనున్నారు.భూ భారతి చట్టంలోని 4(1) సెక్షన్‌ను అనుసరించి రాష్ట్రం లోని గ్రామాల్లో ఉన్న అన్ని రకాల భూముల హక్కుల రికార్డులను రూపొం దిస్తారు. డ్రోన్ సాంకేతికతను ఉపయోగించి భూ భాగాలను మ్యాపింగ్ చేయనున్నారు. తెల్లకాగితాలపై ఒప్పందాల ద్వారా (సాదాబైనామా) 2014, జూన్ 2కు ముందు జరిగిన కొనుగోళ్లను క్రమబద్ధీకరించాలని ఆర్వోఆర్-2024 చట్టం సెక్షన్ 6(1) ద్వారా నిర్ణయిం చారు. ఆర్డీవో స్థాయిలో విచారణ నిర్వహించి క్రమబద్ధీకరణ ప్రక్రియను నిర్వహిస్తారు.

**ప్రపంచవ్యాప్తంగా ఉండే హిందువులందరూ కుంభమేళాను ఎంతో పవిత్రంగా భావిస్తారు వచ్చే ఏడాది కుంభమేళా ఉత్సవాలు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్‌లో ప్రారంభం కానుంది. ఈ పవిత్రమైన కుంభమేళాలో మనకు నాగ సాధువులు కచ్చితంగా కనిపిస్తారు. తపోధనులైన వీరు ఎందుకు నగ్నంగా ఉంటారు. వీరి ఆశీస్సులు తీసుకునేందుకు భక్తులు ఎందుకని తరలివస్తారో కొంత చెప్పండి**

**– సీతామాలక్ష్మి, వెంకటాపురం, విశాఖపట్నం**

నాగ సాధువులు ప్రత్యేక వస్త్రధారణ కలిగి ఉంటారు. వీరి జీవన శైలి కూడా సాధారణ ప్రజల కంటే చాలా భిన్నంగా ఉంటుంది. వీరు ఆధ్యాత్మిక, సనాతన ధర్మాన్ని రక్షించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తారు. నాగ సాధువు అంటే వివిధ ఆకారాలకు చెందిన వారు. వీరు బట్టలు, బంధాలు ఇతర వాటిని త్యజించి సన్యాసి జీవితాన్ని గడుపుతారు. వీరి ఆచారాల ప్రకారం, శీతాకాలం, వేసవికాలం అయినా నగ్నంగా ఉండాలి. వీరు తమ మనసుతో శరీరాన్ని శాసిస్తారు. తపస్సు, ధ్యానం, బ్రహ్మచర్యాన్ని కచ్చితంగా పాటిస్తారు. అంతేకాదు జనవాసానికి చాలా దూరంగా ఉంటారు.

కుంభమేళా వంటి ప్రత్యేక సమయాల్లో మాత్రమే వీరు బయటకు వస్తుంటారు. నాగసాధువులు అనునిత్యం ధ్యానంలో ఉంటూ, సమాజానికి దూరంగా ఉంటామని దేవుని ముందు ప్రమాణం చేస్తారు. వీరు తమ అనుభవాలను, ఆలోచనలను కేవలం నాగ సాధువులతో మాత్రమే పంచుకుంటారు. గంగానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. భక్తులకు హితబోధ చేస్తారు. అంతేకాదు తమ శక్తియుక్తులను కూడా ప్రదర్శిస్తారు. వీరు మహా కుంభమేళా సందర్భంగా ఒంటినిండా భస్మం, పూలు, తిలకం, రుద్రాక్, పటకారు, రోలి, చందనం, ఢమరుకం, కాజల్, ఇనుప ఉంగరం, అర్ధచంద్రుడు, త్రిశూలం, గద్దె తదితర ఆయుధాలను దరించి అందరినీ ఆకర్షిస్తారు. వీరి ఆశీస్సులు పొందేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తారు.

నాగ సాధువులందరూ ఎల్లప్పుడూ నగ్నంగా ఉంటారు. ప్రత్యక్షంగా కనిపించే గగనాన్ని తమ దుస్తులుగా పరిగణిస్తారు. కత్తి, త్రిశూలం తదితర ఆయుధాలను ఎలా వాడాలో నాగసాధువులకు బాగా తెలుసుకు. వీరు ఎల్లప్పుడూ చల్లని నీటితో స్నానం చేస్తుంటారు. అనునిత్యం శివయ్యను స్మరించుకుంటూ కఠిన తపస్సు చేస్తారు. కుంభమేళా పూర్తయిన తర్వాత తాము నివసించే అడవులు, కొండలకు వెళ్లిపోతారు.

## లెజెండ్

# అసమాన సేవా తత్పరుడు జనరల్ తిమ్మప్ప



జనరల్ కోదండర సుబ్బయ్య తిమ్మయ్య భారత సైన్యంలో ఒక విశిష్ట సైనికుడు. అయన 1957 నుండి 1961 వరకు భారత చైనా దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న సమయంలో భారత సైన్యంలో ఛీఫ్ ఇన్ ఆర్మీ స్టాఫ్‌గా కీలకమైన సేవలను అందించారు. రెండవ ప్రపంచ యుద్ధం పదాతి దళానికి నాయకత్వం వహించిన ఏకైక భారతీయుడు. ఆయన భారత సైన్యం అందిం చిన విశిష్ట అధికారిగా గుర్తింపు పొందారు. కొరియా యుద్ధం తరువాత, యుద్ధ ఖైదీలను వారి వారి దేశాలకు తిరిగి పంపే పనిలో ఐక్యరాజ్య సమితి విభాగానికి నాయకత్వం వహిం చారు. ఆర్మీ నుండి పదవీ విరమణ చేసిన తరువాత 1964 జూలై నుండి డిసెంబరు 1965 వరకు సైప్రస్ దేశంలో ఐక్యరాజ్య సమితి శాంతి సంరక్షక దళానికి కమాండ ర్‌గా నియమించ బడ్డారు. సైప్రస్‌లో 17 డిసెంబరు 1965లో మరణించారు.ఆయన కర్ణాటక రాష్ట్రం కొడగు జిల్లా (పూర్వపు పేరు కూర్గ్) మద్దికెరి గ్రామంలో 1906, మార్చి 30వ తేదీన తిమ్మయ్య సీతమ్మ దంపతుల కు జన్మించారు. తల్లి సీతమ్మ విద్యావంతురాలు, సంఘ సేవకురాలు. ఆమెకు బ్రిటిష్ ప్రభు త్వం కైసర్ - ఎ- హింద్ బిరుదును ప్రదానం చేసింది. ఆయ న అన్న పొన్నప్ప, తాను, త వు తమ్ముడు సోమయ్య ముగ్గురూ భారత సైన్యం లో అధికారులుగా పనిచేశారు. మెరుగైన విద్య అభ్యసించాలనే ఉద్దేశంతో తన 8వ యేటనే తమిళ నాడు రాష్ట్రం కూనూరులోని సెయింట్ జోసెఫ్ కాలేజీలో చేరారు. ఆ తర్వాత బెంగళూరు లోని బిషప్ కాటన్ బాయ్స్ స్కూలులో చదివారు. ప్రాథమిక విద్య ముగిసి న తరువాత డెహ్రాడూన్ లోని ప్రిన్స్ ఆఫ్ వేల్స్ రాయల్ ఇండియన్ మిలటరీ కాలేజీ (%=×వీజ%)లో చేరారు. అక్కడి నుండి పట్టా పొందిన తరువాత ఆయన ఇంగ్లాండు లోని రాయల్ మిలటరీ కాలేజీకి తర్వాత శిక్షణ కోసం ఎంపిక చేయ బడ్డారు.

మిలటరీ శిక్షణ తరువాత 1926 ఫిబ్రవరి 4న అయనను బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో సెకండ్ లెఫ్టినెంట్‌గా నియమించారు. ఆ బ్యాచ్‌లో నియమింప బడిన వారిలో ఆయన తరువాత ఛీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా పనిచేసిన ప్రాణ్ నాథ్ థాపర్ ఉన్నారు. తిమ్మయ్య 19వ హైదరాబాద్ రెజిమెంట్‌కు చెందిన 4వ బెటాలియన్‌లో 1927 మే 28న నియమించ బడ్డారు. 1928 మే 4న ఇతడు లెఫ్టినెంట్‌గా పదోన్నతి పొందారు. 1930లో రెజిమెంటల్ సహాయాధికారిగా నియమించిన తరువాత తన నైపుణ్యంతో నార్త్ వెస్ట్ ఫ్రంటియర్ (నేటి పాకిస్తాన్) లోని పఠాన్ ఆదివాసీ తిరుగుబాటు దారులను అణచ గలిగారు.

1935 ఫిబ్రవరి 4న ఇతడు కెప్టెన్‌గా పదోన్నతి పొందారు. 1936 ఏప్రిల్‌లో ఇతడు మద్రాసులోని యూనివర్సిటీ ట్రైనింగ్ కార్ప్స్‌కు సహాయాధికారిగా బదిలీ కాబడ్డారు.తరువాత ఆయనను సింగపూర్ బెటాలియన్‌కు బదిలీ చేశారు. 1941లో ఆయనను ఆగ్రాలోని హైదరాబాద్ రెజిమెంటల్ సెంటర్‌లో సెకండ్ - ఇన్ - కామాం డ్‌గా నియమించారు. తరువాత ఇతనిని క్వెట్టాలోని స్టాఫ్ కాలేజీలో శిక్షణ కోసం పంపారు. అక్కడ అయన, అయన భార్య 1935 క్వెట్టా భూకంప బాధితులకు ఎనలేని సేవలను అందించారు. 1943లో ఆయనను మేజర్ పదవి లభించింది. ఇతడు 25వ పదాతి దళానికి గ్రేడ్2 స్టాఫ్ ఆఫీసర్‌గా నియమితుడైనారు. సైన్యంలో ఆ పదవిని వరించిన తొలి భారతీ యుడు తిమ్మయ్య. పదాతి దళం అడవులలో యుద్ధ శిక్షణను పొంది రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ సేనలను బర్మాలో ఎదుర్కొంది. 1944లో అయన లెఫ్టినెంట్ కల్నల్‌గా పదోన్నతి పొంది బర్మాలో 8వ, 19వ హైదరాబాద్ రెజిమెంట్ లకు కమాండింగ్ ఆఫీసర్‌గా పనిచేశారు. 1945లో ఇతడు బ్రిగేడియర్ ర్యాంకుకు ఎదిగారు. యుద్ధంలో అయన సేవలకు గుర్తింపుగా డిస్టింగ్విష్డ్ సర్వీస్ ఆర్డర్ ను ప్రకటించారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆయనను స్వదేశానికి వెనుకకు రప్పించారు.

1947లో భారతదేశానికి తిరిగి వచ్చిన తరువాత పాకిస్తాన్ విభజన సందర్భంగా భారత్ పాకిస్తాన్‌ల మధ్య ఆయుధాలు, పనిముట్లు, సైన్యం పంపకాల కమిటీలో ఆయనను సభ్యుడిగా నియమించారు. దాని తరువాత సెప్టెంబర్ 1947లో మేజర్ జనరల్‌గా పదోన్నతి కల్పించి 4వ పదాతి దళానికి కమాండ్‌గా నియమించారు. 1948 లో కాశ్మీర్‌లో జరిగిన భారత్-పాక్ యుద్ధంలో ఇతడు క్రియాశీలక పాత్రను నిర్వహించారు. 19వ పదాతి దళానికి కమాండర్‌గా వ్యవహరిస్తూ కాశ్మీర్ లోయ నుండి పాకిస్తాన్ సేనను తరిమికొట్టారు. షేక్ అబ్దుల్లా, బక్షి గులాం మొహ మ్మద్, జవహర్‌లాల్ నెహ్రూలతో సత్సంబంధాలను ఏర్పరచు కున్నారు. డెహ్రాడూన్ లోని ప్రతిష్టాత్మక ఇండియన్ మిలటరీ అకాడమీకి కమాండెంట్‌గా వ్యవహరించారు. ఆయనకు గల అపార అనుభ వాన్ని పరిగణనలో తీసుకుని ఐకరాజ్య సమితి... తటస్థ దేశాల రిపాట్రియేషన్ కమీషన్‌కు ముఖ్యునిగా నియమించి కొరియాకు పంపింది. ఇది చాలా సున్నితమైన, అసాధారణమైన పని కావడంతో చాకచక్యంతో నెరవేర్చ గలిగారు. ఆయన స్వదేశానికి తిరిగి వచ్చి లెఫ్టినెంట్ జనరల్ హొదాలో జనరల్ ఆఫీసర్ కమాండింగ్, సదరన్ కమాండ్‌గా 1953లో నియమితుడైనారు. 1954లో ఇతనికి భారత ప్రభుత్వం పద్మ భూషణ్ అవార్డును ఇచ్చి సత్కరించింది. ఆయన 1957, మే 7న 6వ ఛీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా బాధ్యతలను చేపట్టారు. 1959లో అప్పటి కేంద్ర రక్షణ మంత్రి వి. కె. కృష్ణ మేనన్ తో ఏర్పడిన విభేదాల కారణంగా పదవికి రాజీనామా చేశారు. కానీ ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ అయన రాజీనామాను తిరస్కరించడంతో పదవిలో కొనసాగారు. 35 ఏళ్ల మిలటరీ సర్వీసు పూర్తి చేసుకుని 1961 మే 7న పదవీ విరమణ చేశారు.భారత సైన్యం నుండి పదవీ విరమణ తరువాత ఐక్యరాజ్య సమితి ఆయన సేవలను మ-రోసారి ఉపయోగించ తలపెట్టి, సైప్రస్‌లో ఐక్యరాజ్య సమితి సేన లకు కమాండర్‌గా జూలై 1964లో నియమించింది. ఆ పదవిలో ఉన్న సమయం లోనే 1965, డిసెంబరు 17న మరణించారు. ఆయన పార్థివ దేహాన్ని అంత్యక్రియల కోసం బెంగళూరుకు తరలించారు. అయన స్మృత్యర్థం బెంగళూరు, పూనే, సైప్రస్‌లోని లార్నకా నగరాలలో కొన్ని వీధులకు జనరల్ తిమ్మయ్య రోడ్ అని నామకరణం చేశారు. 1966లో రిపబ్లిక్ ఆఫ్ సైప్రస్ ఇతని స్మారక తపాలా బిళ్ళను విడుదల చేసి గౌరవించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

## నవ కవిత్వం

### నా మనసుతో.....



అంతరంగంలో ఏదో అలజడి
ఆలోచనల ఒరవడి
నా మనసుతో సంభాషిస్తున్నా
సంతోషం ఎక్కడ దొరుకుతుంది
సుఖం చిరునామా ఎక్కడుంది
మనసు అర్థం చేసుకోలేకపోయింది
దుఃఖం బహుమతిగా
తీసుకునివచ్చింది

మనసు పిచ్చిది
మాయమర్మం ఎరుగనిది
భాధనే కోరుకుంది
ప్రంపంచమంతా సంతోషం
నాలో అర్థం కాని అంతర్మధనం


ఒకవైపు ప్రేమ కాంతివంతం
ఇంకోవైపు మృత్యువు తెచ్చిన
అంథకారం
మనసుకు అనేక రూపాలున్నాయి

నా రూపమేమిది
నా ఆకారమేది
నేను యోగినా
నేను దుష్టుడినా

ఏన్నో దారులు ఉన్నాయి
ఎన్నో మజిలీలు ఉన్నాయి
నేను ప్రయాణం మొదలు పెట్టాను
రహదారులు ముందుకు
సాగిపోయాయి
నేను వెనుకబడిపోయాను
మనసు చుట్టూ ప్రదక్షిణలు
చేస్తున్నాను
మనసును ప్రశ్నిస్తూనే ఉన్నాను
సుఖం ఎక్కడ
సంతోషం ఎక్కడ

**అరుణ డేనియల్**
**9000606889**

## లేఖలు




**ముఖచిత్ర కథనం**

ఈ దేశ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ గురించి సునివిత పదాల తో మంచి వ్యాసం అందిం చిన రచయితకు, ప్రచురించిన సూర్య య జ వ న్యా ని కి సంపాదక మండలికి ధన్యవాదాలు. ు్రత్యేక కథనాన్ని ఆదివారం అ న ు బ ం ధ ం లో ప్రచురించడం బాగుంది. అన్ని పత్రికలకు విభిన్నంగా భిన్న అంశాలను ముఖపత్ర కథనాలుగా ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి, యాజమాన్యానికి ధన్యవాదాలు. ఈ తరహా మరిన్ని కథనాలు ప్రచురించాలని కోరుతున్నాము. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుంటుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**
**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రాలలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుఫణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకులకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి,**
**హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుం ది. . రచిత కథనాన్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

## ఎక్కడ మనిషి ఆనవాళ్లు



మనిషి నడక
ప్రకృతితో మమేకమై సాగుతుంది.

కాలంలో తొంగుచూసిన మార్పు
మనిషిని మింగేసి
బిజీబోర్డును మెడకు తగిలించి
బరువైన మాటలు మనసుకు
అలసటతో జత కలిపింది.


మనిషి యంత్రాల ప్రేమలో మునిగి
కొత్త ముఖాలకు తగిలించుకొని
ప్రక్కవారినే మర్చిపోయాడు.

పెదవులపై నవ్వులవనాలు
తగలెట్టి ఒంటరై
కొత్తలోకం సృష్టించుకున్నాడు
తన కోసం.
అక్కడ మనసులతో పనిలేదు
గుర్తింపును వెతుక్కోవటం తప్ప.

యంత్రాలతో సంభాషిస్తూ
తోటివారితో మాట కలపటం మరచి
మనిషి మాయమైపోతున్నాడు.

**–చింతా రాంబాబు**
**9948178092**

# మంగళాచరణం



స్నేహం – తేనెమనసుల్లో వెల్లివిరిసే నాకం అన్నాడొక ఆధునిక కవి .

జీవితం కురు పాండవ రణక్షేత్రమైనప్పుడు విజయానికి సారథ్యం వహించేది స్నేహమే .! కృష్ణుణ్ణి కుచేలుణ్ణి కలిపి ఉంచింది . రాముణ్ణి రావణాసురుడి సోదరుణ్ణి కలిపి నడిపించిందీ ఈ స్నేహ సౌహార్ధమే ! .' సర్వేభవన్తు సుఖినః । సర్వేసన్తు నిరామయా ు– అందరూ సుఖంగా , నిశ్చిం తగా ఉండాలి .ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి .మంగళవచనాలు వీనులకు , మంగళకార్యాలు అక్షు లకు విందులు చేయాలి .ఏ ఒక్కరూ దుఃఖభాజితులు కారాదు ' అని కోరుకొనే. ' మంగళాచరణం ' తెలుగునాట ప్రతి గుడి ముంగిట సమయ సందర్భం వచ్చినప్పుడల్లా గుడి గంటలతో కలిసి ప్రతిధ్వనించడం అనుచానంగా వస్తున్న సదాచారం .

వాక్కును మితంగా వాడితే. అదే మంత్రమవుతుంది ' అంటారు శ్రీ శంకరులు .తా మెల్లరూ భద్రంగా ఉంటూనే చుట్టుపక్కలవాళ్ళందరూ క్షేమంగా జీవించాలని మనసా. వాచా కాంక్షించే సంకల్పం " యోగక్షేమం మహామ్యహమ్" కల్పన చేసింది .అభయహస్తం ఆశించి వచ్చినవాడు పరమ శత్రువైనా సరే ఉభయకుశలోపరి విచారించకుండా తిప్పి పంపడం భారతీయులకు బొత్తిగా సరిపడని సంస్కృతి .పంచమవేదంగా భావించే మహాభారతంలో సైతం అడుగడుగునా సత్సంప్రాదాయాలు కంట పడుతుంటాయి .యుద్దానికి ముందు సాయం అర్థించేందుకు ద్వారకా పురి చేరుకుంటాడు సుయోధన మహారాజు .

కిట్టనివాడనియ్యేమన్నా పలుచన చేశాడా ?
' బావా ! ఎప్పుడు వచ్చితీవు ?
సుఖులే భ్రాతల్– సుతుల్– చుట్టముల్? అంటూ యోగక్ఛేమాలన్నీ చుట్ట బెట్టి మరీ విచారించాడు .తిరుపతి వేంకట కవుల 'పాండవోద్యోగ విజయాలు 'లోని ఈ పద్యాలు నేటికి ప్రతి తెలుగు నోటా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి .
'నోరు మంచి – ఊరు మంచి ,' 'మంచిమాట మనుగడకు ఊరట', సూక్తులెన్నో చిన్న బాలల నోళ్ళలో సుళ్ళు తిరుగుతుంటాయి .'ఐకమత్యమే అసలు బలిమి' అని , ' కలిసి ఉంటేనే కలదు కలిమి' అని , ' విడిపోతే చెడిపోతాం......... చెడిపోతే పడిపోతా' మని పిల్లల నేమిటి.... పెద్దలూ. ఒంటపట్టించుకోవాల్సిన నిత్య జీవిత వ్యక్తిత్వ సూత్రాలే ! సదాచారం , సత్సంప్రదాయం సంకలించిన జీవన వాధానమే సంస్కృతి' అన్నది వివేకానందుడి సిద్దాంతము . జీవన నిర్వచనం. !'

వ్యక్తిలోని మూర్తివంతమైన సంస్కృతే పరిణత మానవత్వంగా పరిమళించేది ' అని రమణ మహర్షి బోధన కూడా ! మంచి నడవడిక , సంఘ న్యాయౌన్నత్యం, సుఖజీవనం , సర్వమానవ సౌభ్రాతృత్వం వంటి సుగుణాలు పెంపొందించే జీవకళలు వంద ఉదహరించాడు .నాలుగో శతాబ్దినాటి క్ఛేమేంద్రుడు తన ఔచిత్య సిద్దాంత విచారధారలో లోభం తండ్రి , మాయ తల్లి , కుటిలనీతి సోదరుడు , కృతక వేషభాషాదులు భార్యస్థా నీయులు , హుంకారం పుత్రుడు .........అమాయక మానవుడి జీవితాన్ని బ్రహ్మదేవుడి పనుపున దంభం ఇంత పెద్ద పరివారంతో భూమ్మీద సంచరిస్తుంటుంది . ' తస్మాత్ జాగ్రత్త 'ని క్ఛేమేంద్రుడు ఆ నాడే వ్యంగంగా హెచ్చరించాడు .స్వసంస్కృతీనిష్ఠులై, స్వదేశానురాగులయీ.... పరసంస్కృతుల పట్ల. సంసర్గం , పరాయి దేశాల పట్ల గౌరవాలు పుష్కలంగా ప్రదర్శించే సామరస్య ధోరణి సనాతనధర్మస్థుల మైన మనకు అనాది నుంచి హుందాగా ప్రదర్శిస్తున్న జీవనశైలి .


వేదాంతులు ఎన్ని గ్రంథాలు వ్రాసినా .....వాదాలు చేసినా । ఈ రంగల తెర ఇంద్రజాలం తెలియకనే .

ఎద చేనిలో వెదజల్లిన స్వప్నబీజాలు । మొలకలెత్తి పిలకలు వేసి ! మమతల ధాన్యపురాశులతో మనసు బండ్లను నింపడం ' ఎవరికైనా ఎవరికైనా. ఆనందం కలిగించదు. ? ఉభయకుశలోపరి లోనే మన భారతీయులందరి అభివృద్ధి ఫలాలు దాగున్నాయని గదా ఆశ !

**అయ్యల సోమయాజుల సుబ్రహ్మణ్యము.**
**. 9394743591 .**

సూర్య బుడత

బాలల కథ



# పుట్టిన రోజు




ఎనిమిదవ తరగతి చదువుతున్న సాత్విక పుట్టిన రోజు త్వరలోనే వస్తున్నందుకు ఆనందంలో మునిగిపోయింది.

"నా పుట్టినరోజుకు ప్రతిసారి లాగే చాక్లెట్లు,కేకుతో పాటు మరో వస్తువు కూడా కొనుక్కోవాలమ్మా" అంది వాళ్ళమ్మతో సాత్విక.

" ఖరీదైన దుస్తులు తీసుకోవాలా?" అడిగింది అమ్మ.

"కాదమ్మా! నేనడిగితే కొంటారో లేదో అని భయంగా ఉంది. నాన్న ఎప్పుడు చూడు డబ్బుల్లేవు డబ్బుల్లేవు అంటుంటాడు" అంది.

సాత్విక వాళ్ళది డబ్బున్న కుటుంబం కాదు. ప్రైవేటు ఆసుపత్రిలో కాపలా ఉద్యోగం చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

'నాన్న సంపాదనమన కుటుంబ ఖర్చులకే సరిపోతుంది కదమ్మా! మన కోసం నాన్న చాలా కష్టపడుతున్నాడు కదా! నాన్నను అలా అనకూడదు" అని అనునయంగా చెప్పింది వాళ్ళమ్మ.

"ఐతే ఈసారి నాకు కొత్త బట్టలు వద్దు. వాటి బదులుగా డబ్బులు ఇవ్వండి" అంది సాత్విక.

'దేనికి సెల్ఫోన్ కోసమా" కోప్పడింది వాళ్ళమ్మ. ఎప్పుడు ఆడుకోవడానికి సెల్ఫోన్ ను అడుగుతుంటుందని.సాత్విక వాళ్ళ నాన్న వచ్చిన తర్వాత విషయమంతా చెప్పింది ఆమె.

"ఎందుకమ్మా అలా పట్టు పట్టావ్" వాళ్ళ నాన్న అడిగాడు ప్రేమగా.

"నాన్నా మా పాఠశాలలో మా మాస్టారు చెప్పిన విషయం నన్ను బాగా ఆకట్టుకుంది. అంగవైకల్యం గల వారికి తాత్కాలిక సహాయం కాకుండా శాశ్వత సహాయం చేస్తే వాళ్ళు ఆత్మస్థైర్యంతో బ్రతుకుతారని చెప్పాడు. మీరుకూడా అలాంటి సహాయం చేయమని చెప్పాడు. మనం వెళుతున్న దారిలో కాళ్ళు లేక అడుక్కుం టూ ఒకాయన ఉంటాడు కదా ఆయనకు నా పుట్టిన రోజు కానుకగా శాశ్వత సహాయం చేయాలనుకుం టున్నాను. దాని కోసమే కొత్తబట్టలుకాకుండా డబ్బులు అడిగాను"అంది సాత్విక.


చాలా మంచి ఆలోచన చేస్తోందని మనసులోనే అభినందిచాడు వాళ్ళ నాన్న.


"సరే నీ ఇష్టం ఏది కొనాలో చెప్పు కొనుక్కుందాం" అన్నాడు. ఎగిరి గంతులేసింది సాత్విక.

పుట్టిన రోజుకు కొత్తబట్టలతో పాటు మనుషుల బరువు తూచే యంత్రాన్ని కూడా కొనుక్కున్నారు. పుట్టిన రోజు నాడు ఆనందంతో కాళ్ళు లేని వికలాంగుడికి తూచే యంత్రాన్ని బహుమతిగా ఇచ్చింది. ఆయన ఆనందంతో సాత్వికను "వందేళ్లు చల్లాగా ఉండమ్మా" అంటూ దీవించాడు.


ఎరునాడు పాఠశాలకు వెళుతూ ఆయనను గమనించింది సాత్విక. ఆయన దారిన పోయే వారిని అడుక్కోవటం లేదు. దారిన పోయే వారే వారి బరువును తూచుకొని డబ్బులు ఇస్తున్నారు. సాత్విక ముఖం సంతోషంతో వెయ్యి వాట్స్ బలుబులా వెలిగిపోయింది.


**ఆవుల చక్రపాణి యాదవ్**
**9963350973**









## ఈవారం కథ

# అదృష్టమంటే....

రచన : పంతంగి శ్రీనివాస రావు,
9182203351



తనది ఒక విధంగా బలవంతపు పెళ్లి.
అవును.. తన కుటుంబం దిగువ మధ్య తరగతికి చెందినది.
ఆర్థికంగా అట్టడుగున ఉండే వారు తనను కన్నవారు.
తన తండ్రి ఒక ప్రయివేటు సంస్థలో అతి సామాన్య ఉద్యోగి.
అందుకే, నచ్చానంటూ వచ్చిన ఓ వ్యక్తికి కట్టబెట్టారు తనను.
ఒక విధంగా చెప్పాలంటే తను ఆర్థికంగా దిగువన ఉన్నా, తన కలలు మాత్రం ఎంతో ఎత్తున వుండేవి. తన కలల నిండా ఎన్నో, ఎన్నెన్నో ఊహలు. తనను మెచ్చేవాడు ' హేండ్సం ' గా ఉండాలి.
కొద్దిగా ' రఫ్ ' గా ఉండి సోకాల్డ్ లేటెస్ట్ టాలీవుడ్ హీరోలా వుండాలి. కానీ, తనకు అలా ఆలోచించే అవకాశం లేదు.
తనకు కాబోయే వరుడు తాను వలచిన వాడు అయ్యే అవకాశం లేదని తన పరిస్థితులు నిరూపించాయి.
తనకా ' యోగ్యత ' లేదు. కారణం.. తను పుట్టి పెరిగిన వాతావరణం. ' హీరోయిన్ ' ఆగర్భ దరిద్రురాలు. హీరో ఓ పెద్ద బిజినెస్ టైకూన్.. వారి మధ్య డ్యూయెట్స్.. అధర చుంబనం.. పెద్దలను ఎదిరించి ఆమెను చేపట్టడం. వావ్.. ఎంత గ్లామర్ గా ఉంటాయి అటువంటి సినిమాలు.
ఊహల్లో తేలిపోయేది తాను. క్లైమాక్స్ ' లో ఎంతో అట్టహాసంగా జరిగేది వారి వివాహం.మళ్ళీ ఊహలు..
ఆ హీరోయిన్ కంటే తానేం తక్కువ.
తను షాపింగ్ మాల్స్ కు వెళ్లేదే నిలువెత్తు అద్దంలో తనను తాను మరీ మరీ పరికించి చూసుకోడానికి.
లేలేత పెదవులు.. తడి తడిగా తేనె ఊట ఊరినట్లు. వాటిని గ్రోలేది తన కలల రాకుమారుడు కావాలి కానీ, తను వలచని వాడు కాకూడదు.
మరీ పరికించి చూస్తే శంఖం వంటి మెడ క్రింద పయ్యెదను సవాలు చేస్తూ పొంగులు.
సన్నటి నడుము వంపులో ఓ చిన్న పాటి మడత.
ఇటువంటి సౌందర్యం తను మెచ్చిన వాడికి అర్పించాలని కదా తాను కలలు కనేది. మరి..
తన ' ఫీలింగ్స్ ' ఎవరూ అర్థం చేసుకోరేమిటి చెప్మా...!
ఒక్కసారిగా, తనకు మూడు ముళ్ళు వేసినతడిని తలచుకుంటే ..
తనలో ఏ విధమైన భావాలూ కలగటం లేదు.
తన వంటిలోని ఏ భాగమూ స్పందించడం లేదు.
ఎటువంటి భావన లేకుండా, ఈ శరీరాన్ని తనకు ' భర్త ' అని పిలవబడే వ్యక్తి చేతికి అందించడమా?
ఓహ్.. ఏమిటి ఈ వైపరీత్యం..
'నో(.. అలా అంటే ఎలా? ఎటువంటి వాడైనా, ఎలా ఉన్నా కూడా అతను నీ మొగుడు.. నీకూ..నీ శరీరానికి హక్కు దారుడు..:' అంటుంది ఈ సమాజం.
మరి ' మనస్సు ' కు...!
ఛా.. బోడి మనస్సు ఎవరికి కావాలి?
అదేం కనపడేదా?
ఇలా..ఇలా.. మధన పడుతుండగానే, తన ప్రమేయం ఏమీ లేనట్లు..
తనను అలంకరించసాగారు.
చుట్టూ కిలకిలలు.. గాజుల చప్పుళ్ళు.. పరిహాసాలు...
ఎవరి ధోరణి వారిదే...
ఒక్కసారి గట్టిగా అరవాలనిపిస్తోంది ' ఈ తంతు తనకు ఇష్టం లేదని..'
తన చేతికి పాలగ్లాసుని ఇచ్చి గదిలోకి తీసాక, ఒక్కటే అనిపించింది తనకు..
ఆ ' గ్లాసు ' లో రెండు చుక్కలు ' విషపు ' బొట్లు చిలకరించాలని...
అలంకరించిన మంచం మీద నవ్వుతూ అతను.
తన శరీరపు యజమాని.. తనను హక్కుగా భావించే అతను నవ్వుతూ..
సినిమాల్లో ' విలన్ ' లా...
ఈ రోజుల్లో సినిమాల్లో విలన్లు కూడా బాగానే ఉంటున్నారు. వారి నవ్వూ బాగానే వుంటుంది. పోనీ, ' జోకర్ ' అనుకుందామా..
అతను లేచి దగ్గరకు వచ్చి భుజం మీద చెయ్యి వేసి ఎంతో ప్రేమగా..
ఛా.. అది ప్రేమంటారా? ' ఆ ' అవసరం అంటారా?
తనను మంచం మీద కూర్చోబెట్టి ' ముఖుకాన్ని ' పైకెత్తాడు.
తాను సిగ్గు పడుతున్నాను అని అనుకుంటున్నాడు మానవుడు.
అతని చేయి కొద్దిగా క్రిందకు వచ్చి...
పైట కొంగును తొలగిస్తాడా? ఏమిటి? కొంపదీసి!
మరీ ఇంత హక్కునా?
అదే నవ్వు.. తనకు నచ్చనిది..
తన మోహం మాత్రం వెలిగించిన స్టవ్వు ఆపడం మరచిపోతే, మాడిపోయిన పదార్థంలా..
' సిగ్గా? ' అడుగుతున్నాడు.
గోంగూర పచ్చడి కోసం ఆత్ర పడుతున్నట్లు.
తనకు మూడ్ బాలేదు..
తన మోహంలో ఫీలింగ్స్ గమనించిన వాడై..
' ఓ( సారీ.. ! నీ మూడ్ బాగాలేదా? ఏనీ ప్రాబ్లం..' కొద్దిగా ఆందోళన.. మొహంలో అదే చిరునవ్వు..
చిరాకు కనిపించదేమి? ఎన్నో కోరికలతో, ఎంతో వేడిని నింపుకుని వచ్చిన మగవాడికి ఆడదాని నిరాదరణ చూసి ' విసుగు ' కలగదా?
' ఓ( పోనీ.. రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు.. మొదటి రాత్రి ఇరువురి అంగీకారంతో జరిగితేనే మధురం.. ఆ తియ్యని రాత్రి కోసం ఎంతకాలమైనా, ఎదురు చూస్తాను.. సరేనా?'
అతని మాట విని ' హమ్మయ్య ' ఎంతో తేలిక పడింది మనస్సు..

*****

రోజులు గడుస్తున్నాయి.
జీవితం విసుగనిపిస్తోంది.
తాను కోరుకున్న సరదా లేదు.. సంతోషమూ లేదు..
ఎంతో ' దల్ ' గా ఉంటోన్న తనను చూసి అతనే అడిగాడు.
' పుట్టిల్లు గుర్తుకు వచ్చిందా? సరే వెళ్ళు..' అని.
ఆ ( అక్కడ మాత్రం ఏముంది? కాకపోతే, ఈ అసమర్ధ మొహం.. అదేంటి..ఏదో జాబ్ ఉంది. తిండికి లోటు లేదు..కిరాయి ' కొంప ' వుంది. నా పతి.. ఛా.. అంత పలుకు అవసరం లేదు. నా మొగుడు వంటి ' జడ ' పదార్థం.. ఇది కూడా అతక లేదు. తను ' ఓకె ' అంటేనే కదా.. అతను ఆ పదార్థం అవునో, కాదో! తెలిసేది..ఏదో పోషిస్తున్నాడు కదా.. అసమర్థుడు అంటే లోకం ఒప్పుకోవద్దూ...ఇంతెందుకు..తను మనలేని చోటు నుండి కొద్దిగా ' రిలీఫ్ '. అయితే, ఇటువంటి మొగుడిని కట్టబెట్టినందుకు తన అమ్మా నాన్నలన్నా ' కసి ' వుంది. ఏం చేయాలి? పొయ్యి కంటే పెనం నయం కదా!

******

ఏంటే ఇలా వచ్చావ్? ' అడిగిన తల్లిని విష్పురుగు చూసినట్లు చూసింది.
' అదేం అడగటం..!' లక్షణమైన వాడికి లక్షలు ధారబోసి కట్టబెట్టినట్టు..
సాయంత్రం వేళ... హఠాత్తుగా ప్రత్యక్షమైన ఓ వ్యక్తిని చూసి నోట మాట రాలేదు తనకు. కొద్ది క్షణాల తర్వాత కోలుకున్నదై ఎదురెళ్ళి వాటేసుకుంది.
' హాయ్.. అర్చనా..ఎంత కాలమయిందే నిన్ను చూసి , నా పెళ్ళికి రాలేదేం దొంగా..' అంటూ..
ఎంతో ఆనందం...
కొద్ది రోజులు తనకు ' పిచ్చ ' కాలక్షేపం.
' అవునులే! నీ తాహతుకు తూగననే కదా, ఈ పేదింటి అమ్మాయి పెళ్ళికి..' అంటోన్న తన నోరు ఛప్పున మూసింది చేతితో... ' అర్చన...'
అదృష్టవంతురాలు అయిన ఒక అమ్మాయి. అష్టైశ్వర్యాల మధ్య తులతూగే పడతి. అదృష్టవంతురాలు కనుకనే, అంత గొప్ప సంబంధం. అందమైన రాకుమారుడు. సాటి యువతులు కుళ్లుకునేలా, ఎంతో హుందాతనం గల యువకుడు.
తాను వెళ్ళింది అర్చన వివాహానికి. ఎంత అంగరంగ వైభవంగా జరిగిందని ఆ పెళ్ళి వేడుక. అలా వుండాలి, పెట్టి పుట్టడమంటే.
తన జీవితాంతం కూడబెట్టినా, ఆ రోజు అర్చన కట్టినటువంటి, పెట్టినటువంటి చీరలు, నగల ఖరీదు చేయదు.
ఆ వివాహాన్ని కనులారా తిలకించి తను ఎంతగా ' అసూయ ' చెందిందని..
వైభోగం అంటే అలా వుండాలి!
ఊ(.. చెప్పు ఎలా వుంది నీ సంసార లైఫ్..' కన్ను గీటుతూ అడిగింది అర్చన.
నిస్సారమైన చూపు చూసింది తాను.
ఏంటి అలా వున్నావ్? పెళ్లయి ఎంతో కాలం కాలేదు..' అడిగింది అర్చన.
పిండి కొద్దీ రొట్టె.. నా సంసారంలో సారం లేదే! ' చెప్పింది తాను.
మరి..మీ ఆయనలో ఉందా సా..రం.. ఉంటే అది చాలు..' సరదాగా అంటోన్నా, అర్చనలో ముఖ కవళికల మార్పు తాను గమనించక పోలేదు.నీది కడుపు నిండిన వ్యవహారం. నన్ను చూస్తే నీకు కొద్దిగా చులకనగా ఉం టుందిలే!' ఫీలవుతూ చెప్పింది తను.
మెరిసేదంతా బంగారం కాదు లేవే! ' జీవం లేని చూపొకటి విసిరింది అర్చన.
' చూడు అర్చనా! మా ఆయన జోవియల్ గా ఉంటాడు. ఎప్పుడూ నవ్వుతూ ఉంటాడు. నేనంటే ప్రాణం. అదొక్కటే చాలదుగా! నిజ్జంగా ఇంతవరకు ఆ తంతు జరగలేదు. ఎందుకంటే నాకు ఇంతవరకు అతని మీద ఇష్టం కలుగలేదు. నా ఖర్మ ఎందుకిలా వుంది? మునుముందు కూడా మా మధ్య డిస్టెన్స్ పెరుగుతుందే కానీ తరగదు. నాకూ అచ్చటా ముచ్చటా కావాలిగా!' చెప్తోన్న తనను ఆపి కోపంగా అంది అర్చన.
' టాట్... ఎంత పని చేసావే. నువ్వు చాలా మూరు రాలివి.. నీ అంత అదృష్టం నాకుంటే ఎంత బావుణ్ణు..'
' అదేంటి? ' ఆశ్చర్యంగా అడిగింది తాను.
' పిచ్చి మొహమా! మొగుడికి కావలసింది కట్టుకున్న దాన్ని సుఖపెట్టే సామర్థ్యం..అది లేనినాడు వాడికి ఎంత సిరి ఉంటేనేం? ఎన్ని సంపదలుంటేనేం?'
కొద్ది క్షణాలు మౌనం...
ఆ తరువాత నిశ్శబ్దాన్ని బద్దలు చేస్తూ...
' నీకో నిజం తెలుసా? నేను విడాకులకు అప్లై చేసాను..' చెప్పింది అర్చన.
ఆమె కళ్ళల్లో నీళ్ళు.
ప్రాస్పడి పోవడం తన వంతయింది.
' ఎస్.. నువ్వు విన్నది నిజమేనే.. చూపులకు సుందరాంగుడు. ఇక దీని జీవితానికేం అయింది.. ఎంతో సంపద. జీవితం ప్రశాంతంగా గడిచి పోతుంది. అని మా జంటను చూసి అందరూ కుళ్లుకున్నారు. ఇక, నా సంతోషానికయితే అవధుల్లేవు. బహుశా, నువ్వు కూడా అసూయ పడి ఉంటావు..అవునా? ' సూటిగా అడిగింది అర్చన.
తలూపింది తను.. నిజమే అన్నట్టు.
' అది నాణేనికి ఒకవైపు. మొదటి రాత్రి అందరిలాగానే నేనూ కలలు కన్నాను. నా అలంకరణ చూసి ఎంతో మైకం కమ్మి, నన్ను స్వర్గ లోకపు అంచులకు తీసుకు వెళతాడని కన్నె పిల్లలు కనే ఊహలు నా నరనరాన్ని తొలిచేసాయి. ఉహూ..అతని ప్రవర్తన చూసి కుప్పకూలి పోయాను. ఆ మూడు రాత్రులూ నిస్సారంగా గడిచాయి..'
ఆగి కొద్దిగా శ్వాస తీసుకుని .. ' ఈ విషయం తెలియని మా వాళ్ళు ఫ్లైట్ టికెట్స్ కూడా బుక్ చేసి, మరీ హనీమూన్ కు కూడా పంపారు. ఎన్నో, ఎన్నెన్నో రొమాంటిక్ ప్లేసెస్.. అలవిమాలిన ఏకాంతం. అయినా అతనిలో చలనం లేదు. తనను క్షమించమని కన్నీళ్ళ పర్యంతం అయ్యాడు. నాకెందుకు ద్రోహం చేసావన్న దానికి తల వంచుకున్నాడు అపరాధ భావనతో.ఇప్పుడు తెలిసిందా, నువ్వూహించుకున్న గ్లామర్ లైఫ్ వెనుక ఎంతటి విషాదం ఉందో!'
మౌనంగా ఆలకిస్తోంది అర్చన మాటలను తను.
' ఎన్ని సిరిసంపదలు ఉన్నా కూడా మనిషి బంగారం తినడే పిచ్చి మొహమా! కట్టుకున్న దానికి మానసిక ఉల్లాసం కలిగించిన వాడే నిజమైన మొగుడు. వయస్సులో కన్న కలలను నెరవేర్చే వాడు ఏ స్థాయిలో ఉంటేనేమీ! ఒక విధంగా నిన్ను చూసి నేను జెలసి పడాలి..'
అర్చనను చూస్తోంటే ఇప్పుడు నిజ్జంగా జాలి కలుగుతోంది తనకు.
ఇప్పుడు తనకు అతడే గుర్తుకు వస్తున్నాడు, మళ్ళీ మళ్ళీ..
పదేపదే అతని నవ్వు, సరదాగ మాట్లాడే అతని మాటలే గుర్తుకు వస్తున్నాయి.
అతనికి లేనిది ఆస్తి, హోదా కావొచ్చు. కానీ, అతనిలో ఆడదానికి కావలసినవి అంతకు మించి ఉన్నాయి.

******

హఠాత్తుగా దిగిన తనను చూసి, అతని కళ్ళల్లో వింత మెరుపు...
ఆ మెరుపును చూసి తనలో ఎంతో పశ్చాత్తాప భావన...
ఇతనినా తను దూరం పెట్టింది?
తను ఎంత దూరం జరిగినా, అదే చిరునవ్వు, అదే సహనం.
తనకు ఇంతకు మించిన ' శిక్ష ' మరొకటి లేదు.
అతనిలో నిజానికి ఎంతో ' కసి ' రేగాలి.
దాహం ' తో వున్న అతని ' తృష్ణ ' తీర్చని తనను అతను మానసికంగా, శారీరకంగా హింసించాలి.
అయితే, అతనిలో.....!
తన దృష్టిలో అతను ఎంతో ఎత్తుకు ఎదిగాడు.
ఎన్ని ' రాశులు ' కుప్పలుగా పోస్తేనేమిటి, అవన్నీ అతని వ్యక్తిత్వం ముందు దిగదుడుపే!
సాయంత్రం వేళ తెల్ల చీర కట్టుకుని, తల నిండా విరజాజులు రువ్వుకుని వున్న తను డోర్ నాక్ శబ్దం విని తలుపు తీసింది.
ఎదురుగా అతను..
తన మదనుడు .
సారీ.. ఇది నా ఇల్లనుకున్నాను.. ' అంటూ వెనుదిరగబోయిన అతడిని కుడి చెయ్యి దొరక పుచ్చుకుని, లోపలకు లాగింది.. ' చాల్లే..పరిహాసం ' అంటూ..
' అయ్యో.. సారీ మేడమ్.. నిజంగా ఇది నా ఇల్లే అనుకున్నాను..' అదే సరదా సంభాషణ. అతని వదనాన చెరగని చిరునవ్వు.
అంతే.. అతడిని గట్టిగా హత్తుకుంది తను.
' ఇది కలా? నిజమయితే బావుణ్ణు..' అంటోన్న అతని క్రింది పెదవిని కొరికింది, కొద్దిగా పైకి ఎగబాకి.
' అబ్బా..నిజమే!'
' సారీ బాసూ..నిన్ను చాలా బాధ పెట్టాను..' చెప్తోన్న ఆమెను తన బాహువులతో బంధించాడు బలంగా.
' ఆడదాని అదృష్టం ఇదే...' కిలకిలా నవ్వింది.
అలా తను నవ్వేప్పుడు ' దోసిలి ' పట్టాడు ముత్యాలు ఎక్కడ రాలి పోతాయే-ఽమోనని..

## సరికొత్త సీరియల్

# చాకిరేవు



**(గతవారం .తరువాయి).**

పంచాయితీలో దొంగతనం జరిగిందో లేదో, పెద్దకోటయ్య బట్టల్లో డబ్బు పెట్టాడా లేదా అనేవి దర్యాప్తు చేయకుండా పాపులమ్మను దొంగగా తీర్మానం చేశాడు. మరేదైనా పని చేసుకోవాలన్న కొండారెడ్డి మాటల్లోని అర్థం పాపులమ్మ, సుబ్బక్క, ఆదెన్న గ్రహించారు కానీ ఒక్క మాట కూడా ఎదురు చెప్పలేదు. బీదరికం, అమాయకత్వం, కులాధిపత్యం లాంటివి ఎవరితోనైనా ఏమైనా పడేలా చేస్తుంది.

'అయ్యా.. మేము దొంగతనం చేయలేదు, బట్టల్లో డబ్బే లేదు. బట్టలు ఉతికే ముందు అన్నీ చూసుకొనే నానబెడతామని ఆదెన్న చేతులు కట్టుకొని వినయంగా, భయంగా, భీతిగా చెప్పాడు.'

'నువ్వు దొంగతనం చేశావో లేదా నీ భార్య దొంగతనం చేసిందో నీ గుడిసెను సోదా చేస్తే తెలిసిపోతుందన్నాడు' మరో పల్లె పెద్ద.

మాట వరసకు కూడా పెద్దకోటయ్యను కానీ వరలక్ష్మిని కానీ డబ్బు జోబిలోనే ఖచ్చితంగా పెట్టారా లేదా అని అడగలేదు. అందరూ కలిసి పాపులమ్మ గుడిసెకు వెళ్లారు. పల్లె మొత్తం గుడిసె దగ్గరే ఉన్నారు.

బతకలేక దొంగతనం చేసినట్లు ఉన్నారని ఎవరో నిందించారు, నా జోబీ నుండి కూడా రెండు మూడు సార్లు డబ్బు పొయ్యింది. అడిగితే లేదని చెప్పారని మరెవరో ఆరోపించారు. ఇలా దొంగతనాలు చేయకపోతే ఎలా బతుకుతారని ఇంకెవరో దొంగతనాన్ని బలపరిచారు.

ఎవరూ లేని సమయంలో ఎవరి ఇంట్లోకైనా వెళ్లి ఏదైనా తీసుకుంటేనో, ఎవరి దగ్గరైనా వాళ్లకు తెలియకుండా తీస్తేనో దొంగతనం అవుతుంది. పెద్దకోటయ్య తన జోబీలో డబ్బు మర్చిపోయాడని చెప్తున్నాడు. అందులో ఎంత నిజం ఉందో లేదో నిర్ధారించకుండా, దర్యాప్తు చేయకుండా కోటయ్య చెప్పిన మాటలు విని పాపులమ్మ కుటుంబమే డబ్బు తీసుకుందని తేల్చారు.

దొంగతనాన్ని అంటగట్టి గుడిసె మొత్తం వెతికారు. అదే అగ్ర కులం వాళ్ల మీద దొంగతనం చేశారని ఆరోపిస్తే దళితులను, బీదవారిని బతకనిస్తారా? అసలు నమ్ముతారా? నమ్మడం పక్కన పెడితే ఆరోపించిన వాళ్లను చంపేస్తారు. ఇప్పటికీ ఈ సమాజంలో బీదలను, దళితులను, తక్కువ కులాలవారిని, నల్లగా ఉంటేనో, గంభీరంగా కనపడితేనో దొంగలుగా, రౌడీలుగా చూస్తారు.

పట్టుపంచె కట్టుకునేవాళ్లను, జంజం వేసుకునేవాళ్లను, ఇతర అగ్ర కులస్తులను దొంగలుగా ఊహించను కూడా ఊహించలేరు. కులాలుగా విభజించి, శ్రమను తక్కువ కులాలకు అంటగట్టి దొంగలుగా చేసింది కుల వ్యవస్థ కాదా?

ఆదెన్న, పాపులమ్మల గుడిసెలోకి నలుగురు వెళ్లి బట్టలను, బోకులను బయట వేశారు. గుడిసె మొత్తం జల్లెడ పట్టారు. బట్టలను, బోకులను చిందరవందర చేశారు. గుడిసెలో డబ్బు లేదు.

ఆదెన్న ఇంట్లో పల్లె వాళ్ల సద్దిబట్టలు, పిల్లల మురికి బట్టలు, రాములవారి బట్టలు, స్వామి పట్టు వస్త్రాలు, కొండారెడ్డి తెల్ల పంచెలు, ఆడవాళ్ల బహిష్టు బట్టలు తప్పా మరేమీ లేవు. శ్రమ చేసే వాళ్ల ఇళ్ళలో చెమట తప్ప ఇంకేం ఉంటుంది?

గంగ పెంచుకుంటున్న తొట్టిలోని చేపలను, తొట్టిని కిందపడేశారు. గంగ వెక్కి వెక్కి ఏడ్చింది. తమ గుడిసెను సోదా చేయడం గంగకు అవమానకరంగా అనిపించింది. తన స్నేహితుల ముందు తల దించుకునేలా చేసింది, పట్టరాని దుఃఖం కలిగింది.

గుడిసె నుండి డబ్బును ఎక్కడికో దాటించినట్లు ఉన్నారని ఎవరో అన్నారు. అచ్చుక్క పుట్టింటికి డబ్బు పంపి ఉండవచ్చని మరెవరో తమ బుర్రకు పదును పెట్టి చెప్పారు. వెంటనే అచ్చుక్క కుటుంబాన్ని తీసుకురమ్మని పనిచేసే వాళ్లకు కొండారెడ్డి అజ్ఞాపించాడు. ఆగమేఘాల మీద అచ్చుక్క కుటుంబాన్ని కూడా పంచాయితీలో నిలబెట్టారు.

జరిగిన విషయం తెలుసుకొని 'దొంగతనాలు, దోపిడీలు చేసే కుటుంబం కాదని, భర్త బతికాడో, చచ్చాడో తెలియదు. మా బిడ్డ జీవితం నాశనం అయ్యిందనే బాధలో ఉన్నాము. ఈ ఇంటికి మా బిడ్డను ఇచ్చినందుకు దొంగలుగా నిలబెట్టారని' గట్టిగా అరిచింది అచ్చుక్క తల్లి.

భర్త లేకపోతే మీ బిడ్డను ఎవరి కోసం ఇక్కడే వదిలారు? పైగా గంగులు గాడు వెళ్ళిపోయినప్పుడు పాపులమ్మ గర్భవతి. 'ఏంరా ఆదెన్న అచ్చుక్కను ఇంట్లో ఎందుకు పెట్టుకున్నావని?' నీచంగా అడిగాడు.

'అయ్యా.. కష్టపడేవాడినే తప్ప నీతి లేనివాడిని కాదు, మీరలా మాట్లాడకండని మొరపెట్టుకున్నాడు.'

'నేనింకా ఎందుకు బతికి ఉన్నానా? అని తల బాదుకుంది అచ్చుక్క'

'మీ నాటకాలు ఆపి, డబ్బు ఎక్కడికి సరఫరా చేశారో చెప్పండి' కొండారెడ్డి ఆవేశంగా అరిచాడు.

పెద్దకోటయ్యను జోబీలో ఎంత డబ్బు మర్చిపోయాడో కూడా అడగలేదు. రెండు రోజుల్లో డబ్బు మొత్తం పెద్దకోటయ్యకు అప్పచెప్పాలి, లేదంటే పల్లె పెద్దలు ఇచ్చే తీర్పుకు కట్టుబడి ఉండాలన్నాడు.

ఆరోజు సాయంత్రం రెండు వేల రూపాయలను ఎల్లుండికంతా ఇవ్వాలని పెద్దకోటయ్య చెప్పినట్లు ఈరయ్య పాపులమ్మ గుడిసెకు వెళ్లి చెప్పాడు.

పల్లెలో ఒక్కరు కూడా ఎంత డబ్బు పోయిందని అడగలేదు. కనీసం పల్లె పెద్దలు కూడా దాని గురించి విచారించలేదు. అంతా ఒక పథకం ప్రకారం జరిగిపోయింది.

కొండారెడ్డి తనను, తన కుటుంబాన్ని బతకనివ్వడని పాపులమ్మకు అర్థమయ్యింది. మొన్నటి వరకు బిచ్చం ఎత్తుకునేలా చేశాడు, ఇప్పుడు దొంగలుగా ముద్ర వేశాడు. రేపు ఇంకేం చేస్తాడోనని భయపడింది.

కొండారెడ్డి బారి నుండి తప్పించుకోవాలంటే నా శరీరాన్ని వాడికి అప్పగించాల్సిందేనా? ఒక్కరోజు కళ్ళు మూసుకొని, మనసు చంపుకొని వాడికి లొంగిపోతే ఈ బాధలు ఉండవనుకుంది. తన పిల్లల కోసం, కుటుంబం కోసం శరీరాన్ని కొన్ని గంటల పాటు మృగానికి ఇవ్వాలనుకుంది. ఉదయాన్నే లేచి కొండారెడ్డి దగ్గరికి వెళ్లాలని, చెప్పినట్లు చేస్తానని ఒప్పుకోవాలనుకుంది. కొండారెడ్డికి, తనకు మధ్య జరిగిన విషయం తల్లికి చెప్పుకుంటే ఎలా ఉంటుందోనని ఆలోచించింది. ఇప్పటికే వయసు కారణంగా దొంగతనం నింద, బిచ్చం ఎత్తుకునే శిక్ష పడినందుకు సుబ్బక్క సతమతం అవుతోంది. కొండారెడ్డి గురించి చెప్పి మరింత బాధపెట్టడం ఎందుకనుకుంది.

కొండారెడ్డికి లొంగడం వల్ల బతికి లాభం ఏముంది? దానికంటే చచ్చిపోతే మంచిదనుకుంది. కనీసం కుటుంబమైనా సుఖంగా ఉంటుంది. ఆత్మహత్య చేసుకుంటే నారాయణను ఎవరు చూసుకుంటారు? గంగ పెద్దది అవుతోంది, ఈ సమయంలో గంగకు తల్లి దగ్గర ఉండాల్సిన అవసరం ఉంది. ఆత్మహత్య చేసుకొని పిల్లలను అనాథలను చేయకూడదనుకుంది. సమస్యలకు భయపడి కొండారెడ్డికి లొంగకుండా ఏదైతే అది అవుతుందని, ముందుకు వెళ్లాలనుకుంది. రెండు రోజుల తర్వాత పంచాయితీ మళ్లీ మొదలయ్యింది.

రెండు రోజులు సమయం ఇచ్చినా దొంగలించిన డబ్బు తిరిగి ఇవ్వలేదు కాబట్టి మిమ్మల్ని పల్లె నుండి వెలేయాలనుకుంటున్నాము. నిజానికి పల్లె నుండి వెళ్ళిపోతేనే సుఖంగా బతకచ్చు. వేములలో ఉండటం కంటే దూరంగా ఎక్కడికైనా వెళ్లి సుఖంగా, గౌరవంగా, హుందాగా, కొండారెడ్డి పీడ లేకుండా బతకచ్చు.

'పల్లె నుండి వెల్లగొడితే నా డబ్బు ఎవరిస్తారు? పల్లెలో బట్టలను ఉతికేది ఎవరని?' పెద్దకోటయ్య ప్రశ్నించాడు.

'మరి ఏం చేయమంటావో నువ్వే చెప్పు పెద్దకోటయ్యా?' పల్లె పెద్ద అడిగాడు.

'నా అంగట్లో పాపులమ్మను పని చేయమని చెప్పండి. నెలకు యాభై రూపాయలు చొప్పున జీతం అనుకుంటే, నలభై నెలల పాటు ఉచితంగా పని చేస్తే సరిపోతుందన్నాడు'.

'అదంతా సరే కానీ నువ్వు డబ్బు పోయిందని ఫిర్యాదు చేశావు. అసలు ఎంత పోయిందనే విషయాన్ని చెప్పనేలేదు. రెండు వేలే డబ్బు పోయిందని సాక్ష్యం ఏమిటి? పాపులమ్మకు వేసిన బట్టల జోబీలోనే డబ్బు పెట్టావని ఎలా నమ్మేది?' మాజీ సర్పంచ్ గంగప్ప ప్రశ్నించాడు.

గంగప్పన్న అడిగిన ప్రశ్నకు పెద్దకోటయ్య నీళ్లు నమిలాడు, ఏం చెప్పాలో అర్థంకాక బిత్తిరి చూపులు చూశాడు.

'ఒకవేళ నువ్వు జోబీలో డబ్బు పెట్టుకొని మర్చిపోయి ఉన్నా, నీ ఇంట్లోనే దొంగతనం జరిగి ఉండవచ్చు కదా? పాపులమ్మ కుటుంబమే దొంగతనం చేసిందని చెప్పడానికి ఎలాంటి ఆధారం లేదే? రెండు రోజుల క్రితం పాపులమ్మ గుడిసెతో పాటు అచ్చుక్క కుటుంబాన్ని కూడా విచారించాము. తగిన సాక్ష్యం లేకుండా పాపులమ్మే దొంగతనం చేసిందని ఎలా చెప్పగలము?'

ఒకరోజు సమయం ఇస్తే సాక్ష్యాన్ని తెస్తానని పెద్దకోటయ్య మాటిచ్చాడు. మరుసటి రోజు ఒక వ్యక్తిని తెచ్చి పాపులమ్మే దొంగతనం చేసిందని చెప్పడానికి సాక్ష్యం ఇతనేనన్నాడు.

'ఈ వ్యక్తి మన పల్లెవాడు కాదు, పైగా ఎవరినో తెచ్చి ఇతనే సాక్ష్యం అంటున్నావు?' అర్థమయ్యేలా చెప్పమన్నారు.

'ఇతనెవరో మనకు తెలియకపోయినా పాపులమ్మకు బాగా తెలుసు. ఏం పాపులమ్మ నీ నోటితో నువ్వే చెప్తావా? లేదంటే నన్ను చెప్పమంటావా?' హీనంగా, నీచంగా పాపులమ్మ వైపు పెద్దకోటయ్య చూశాడు.

పాపులమ్మకు ఏమీ అర్థంకాలేదు, ఆ వ్యక్తిని చూసిందే లేదు. 'ఇతనెవరో నాకు తెలియదనింది.'

'చేసిందంతా చేసి తెలియదంటే సరిపోతుందనుకున్నావా? కొవ్వు పట్టి నీచపు పనులు చేశావు. ఆదెన్న లాంటి మంచివాడికి ద్రోహం చేసి, వీడితో రంకు పెట్టుకున్న బజారుదానివి' నీచం, నింద, ఆరోపణ, శీలం మీద, మానం మీద, ఏదైతే జరగకూడదు అనుకుందో అదే జరిగింది.

ఉన్నచోటే కుప్పకూలిపోయింది, నెత్తి మీద మన్ను పోసుకుంటూ నేనింకా ఎందుకు బతికే ఉన్నానని గట్టి గట్టిగా అరిచింది, ఏడ్చింది. ఈ బతుకు బతకడం కంటే చావడమే మేలని బండరాయి తీసుకొని తల పగలగొట్టుకోవాలనుకుంది.

'రంకు బయటపడిన తర్వాత ఇలా చేస్తే వదిలేస్తారని పిచ్చి నాటకాలు ఆడుతోంది. వీడి పేరు నాచారం శీను, చెర్లోపల్లెలో ఉంటాడు. పాపులమ్మ వాళ్లు ప్రతి ఏడాది చెర్లోపల్లె చాకలమ్మ జాతరకు వెళ్తారు. అక్కడ పాపులమ్మకు పరిచయమయ్యాడు, అప్పటి నుండి పాపులమ్మకు, వీడికి రంకు నడుస్తోందని' పెద్ద కోటయ్య ఆరోపించాడు.

'పెద్దకోటయ్య చెప్పేది నిజమేనా?' నాచారం శీనును గంగప్పన్న అడిగాడు.

'అయ్యా, పాపులమ్మతో నాకు నాలుగేళ్ల నుండి పరిచయముంది. మొదటిసారి పాపులమ్మను చాకలమ్మ జాతరలోనే కలిశాను. తనకు గంగ తర్వాత పిల్లలు పుట్టడం లేదని బాధపడేది. పైగా ఆదెన్నలో పిల్లలు పుట్టించే సామర్థ్యం లేదేమోనని అనుమానపడేది. సామర్థ్యం లేకపోతే గంగ ఎలా పుట్టిందని అడిగాను. అదేదో అలా జరిగిపోయింది కానీ ఆ తర్వాత తనలో మగతనం చచ్చిపోయిందని, ముసిలోడు అయ్యాడని, తనకు పిల్లలు కావాలని అడిగింది. నాకింకా పెళ్లి కాలేదు కాబట్టి నా పేరు బయటకు తీసుకురాకూడదన్నాను. అలా మేమిద్దరం కలిశాము. మా కలయికకు ప్రతిఫలంగా నారాయణ పుట్టాడు.'

'నువ్వు చెప్పేది నిజమని ఎలా నమ్మేది?' గంగప్పన్న సూటిగా అడిగాడు.

'ఎవరికో పుట్టిన బిడ్డను నా బిడ్డని ఎందుకు చెప్పుకుంటాను? పైగా పెళ్లి కావాల్సినవాడిని ఇదంతా బజారులో వేసుకుంటే నాకు పిల్లను ఎవరిస్తారు? పాపులమ్మకు యావ, కొవ్వు, మదం ఎక్కువ. అది కామిని జాతి ఆడది, ఏ మగాడిని చూసినా బుట్టలో వేసుకోవాలనుకుంటుంది. అలానే నన్ను కూడా వలలో వేసుకుంది. దాని కారణంగా నేను కూడా ఇలా నడి బజారులో నిలబడాల్సి వచ్చిందని' బాధపడుతున్నట్లు నటించాడు.

గంగప్పన్నను ప్రశ్నలు అడగకుండా కొండారెడ్డి అడ్డుపడ్డాడు. 'మగాడు ఇంతమందిలో తన మానాన్ని, గౌరవాన్ని పక్కనపెట్టి అబద్ధం ఎందుకు చెప్తాడు? మనమైతే చెప్తామా?' నాచారం శీను చెప్పింది నిజమేనని నమ్ముతూ పాపులమ్మ ఇప్పటి నుండి పెద్దకోటయ్య అంగట్లో నలభై నెలల పాటు జీతం లేకుండా పని చేయాలని తీర్పు ఇచ్చాడు.

ఆదెన్న శిలలా నిలబడిపోయాడు, సుబ్బక్క పిచ్చిపట్టినదానిలా నుదుటి మీద కొట్టుకుంటూ బిగ్గరగా ఏడ్చింది. పాపులమ్మ శవంలా మట్టిలో పడుంది. తల్లి మీద ఎలాంటి నింద వేశారో అర్థం చేసుకునే బుద్ధి గంగకు ఉంది.

పాపులమ్మ పక్కనే కూర్చొని గంగ బోరున విలపించింది. పల్లె ప్రజలంతా వెళ్ళిపోయారు. ఆదెన్న కుటుంబం మాత్రం అలానే ఉండిపోయారు. కిందపడిన పాపులమ్మను పైకి ఎత్తాడు. సుబ్బక్క, ఆదెన్న పాపులమ్మ చేతులను భుజాల మీద వేసుకొని గుడిసెకు వెళ్లారు.

గుడిసెలో స్మశాన నిశబ్దం, ఆరోజు ఎక్కడివారు అక్కడే కూలబడిపోయారు. నారాయణను అచ్చుక్క చూసుకుంది.

'నా బిడ్డ తప్పుడు మనిషి కాదు అల్లుడూ' సుబ్బక్క వెక్కి వెక్కి ఏడ్చింది. ఆదెన్న నోటి నుండి ఒక్క మాట కూడా పెగలలేదు.

ఆ క్షణాలు, రాత్రి సుదీర్ఘంగా సాగాయి. మరుసటి రోజు సుబ్బక్క, అచ్చుక్క ఎవరి పనుల్లో వాళ్లు నిమగ్నమయ్యారు. పాపులమ్మ నిద్ర లేవలేదు, లేవాలని అనుకోలేదు.

***

మానం, శీలం కోసం బిచ్చం ఎత్తుకునేలా చేసినా ఓర్చుకుంది, దొంగతనం అంటగట్టినా భరించింది. చాలామంది స్త్రీలు శీలాన్ని పవిత్రంగా భావిస్తారు, అలాంటి శీలం మీద కొండారెడ్డి దెబ్బ కొట్టాడు. శీలం లేని ఆడదంటే ప్రతి ఒక్కడికి లోకువేనని పాపులమ్మకు తెలుసు. పైగా తనకొక ఆడపాప ఉంది. తల్లి రంకు చేస్తుందని తెలిస్తే, గంగను పెళ్లి ఎవరు చేసుకుంటారు? శీలం లేని నేను బతకడం ఎందుకు? ఆదెన్న ఒక్కమాట కూడా అనలేదు. ఆదెన్న మౌనాన్ని భరించలేను, మౌనంగా ఉన్నాడంటే పెద్దకోటయ్య చెప్పిన విషయాన్ని నమ్ముతున్నాడా? నా మీద ఆమాత్రం నమ్మకం లేదా? ఇన్ని సంవత్సరాల సంసారంలో ఇదేనా ఆదెన్న అర్థం చేసుకున్నదని కుమిలిపోయింది.

**(మిగతా వచ్చేవారం)**

**జాని తక్కెడశిల**
**7259511956**





# యువతలో బ్రెయిన్ స్ట్రోక్ ముప్పు

> **గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజెస్ అధ్యయనం ప్రకారం భారతదేశంలో అత్యధిక మరణాలకు రెండవ సాధారణ కారణం స్ట్రోక్. స్ట్రోక్ అనేది రక్తం గడ్డకట్టడం (క్లాట్) లేదా దెబ్బతిన్న రక్తనాళం కారణంగా మెదడుకు రక్త ప్రసరణలో అంతరాయం కలిగినప్పుడు సంభవించే వైద్య అత్యవసర పరిస్థితి. ఆక్సిజన్ మరియు పోషకాలను స్వీకరించడానికి మెదడుకు స్థిరమైన రక్త ప్రవాహం అవసరం. కాగా స్ట్రోక్ (కొన్నిసార్లు "మెదడు దాడి" అని కూడా అంటారు) కేవలం కొన్ని నిమిషాల్లోనే తీవ్రమైన సమస్యలను కలిగిస్తుంది. 40 సెకన్లకు ఒక స్ట్రోక్ మరియు ప్రతి 4 నిమిషాలకు ఒక మరణంతో భారతదేశంలో ప్రతి సంవత్సరం దాదాపు 1,85,000 మంది స్ట్రోక్లకు గురవుతున్నారు.**



గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజెస్ అధ్యయనం ప్రకారం భారతదేశంలో అత్యధిక మరణాలకు రెండవ సాధారణ కారణం స్ట్రోక్. స్ట్రోక్ అనేది రక్తం గడ్డకట్టడం (క్లాట్) లేదా దెబ్బతిన్న రక్తనాళం కారణంగా మెదడుకు రక్త ప్రసరణలో అంతరాయం కలిగినప్పుడు సంభవించే వైద్య అత్యవసర పరిస్థితి. ఆక్సిజన్ మరియు పోషకాలను స్వీకరించడానికి మెదడుకు స్థిరమైన రక్త ప్రవాహం అవసరం. కాగా స్ట్రోక్ (కొన్నిసార్లు "మెదడు దాడి" అని కూడా అంటారు) కేవలం కొన్ని నిమిషాల్లోనే తీవ్రమైన సమస్యలను కలిగిస్తుంది. ప్రతి 40 సెకన్లకు ఒక స్ట్రోక్ మరియు ప్రతి 4 నిమిషాలకు ఒక మరణంతో భారతదేశంలో ప్రతి సంవత్సరం దాదాపు 1,85,000 మంది స్ట్రోక్లకు గురవుతున్నారు. ఢిల్లీలోని సర్ గంగా రామ్ హాస్పిటల్లో ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఒక కార్యక్రమంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ డా ఎం వి పద్మ శ్రీవాస్తవ మాట్లాడుతూ, భారతదేశంలో స్ట్రోక్ రెండవ సాధారణ అత్యధిక మరణాలకు కారణమని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సంభవించే బ్రెయిన్ స్ట్రోక్ సంఘటనలలో 68.6 శాతం మన దేశంలోనే సంభవిస్తున్నాయి. స్ట్రోక్కు గురైన వారిలో దాదాపు 70.9 శాతం మృత్యువాత పడుతుండగా, 77.7 శాతం వైకల్యం సర్దుబాటు చేయబడిన జీవిత సంవత్సరాలు గడపాల్సి వస్తుందని డా శ్రీవాస్తవ ఒక కార్యక్రమంలో తెలిపారు. GBD 2010 స్ట్రోక్ ప్రాజెక్ట్ యొక్క మరొక ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే దాదాపు 52 లక్షలు లేదా 31 శాతం స్ట్రోక్లు 20 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో సంభవిస్తున్నాయి. స్ట్రోక్ భారం భారతదేశంలో ఎక్కువగా ప్రత్యేకించి యువకులు మరియు మధ్య వయస్కులలో ఉంటున్నదని డా శ్రీవాస్తవ చెప్పారు. ఈ గణాంకాలు భారత్ లో పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నప్పటికీ, స్ట్రోక్ రోగులకు త్వరితగతిన సమర్ధవంతమైన చికిత్స అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు మరియు సంస్థాగత సంసిద్ధత భారతీయ ఆసుపత్రులలో లేవని ఆమె వాపోయారు.


## ప్రపంచవ్యాప్తంగా బ్రెయిన్ స్ట్రోక్:

ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) అధ్యయనం ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం దాదాపు అరవై ఐదు లక్షల మంది స్ట్రోక్ కారణంగా మరణిస్తారు. అందుచేత ప్రపంచ వ్యాప్తంగా సంభవించే మరణాలకు ఇది మూడవ ఆరోగ్య సమస్యగా పరిగణించబడుతోంది. దాదాపు ఒక కోటి యాభై లక్షల మంది బ్రెయిన్ స్ట్రోక్ కు గురవుతుండగా అందులో దాదాపు యాభై లక్షల మందికి శాశ్వతంగా వైకల్యం ఏర్పడుతోంది. 25 సంవత్సరాలు దాటిన ప్రతి నలుగురిలో ఒక వ్యక్తికి జీవితకాలంలో ఒకసారి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఉంటుంది. ఈ వ్యాధి కారణంగా సంభవించే 51 శాతం మరణాలలో 6 శాతం 15 నుండి 49 సంవత్సరాలు 34 శాతం 70 సంవత్సరాలు లోపు పురుషులు ఉండడం గమనార్హం.

## గుండెపోటు మరియు స్ట్రోక్ మధ్య వ్యత్యాసం:

గుండెపోటు (హార్ట్ అటాక్) మరియు బ్రెయిన్ స్ట్రోక్ (మెదడుకు యొక్క రక్త ప్రసరణలో అంతరాయం ఏర్పడడం లేదా చిట్లడంతో పాటు ఒక భాగానికి ఆక్సిజన్ చేరకపోవడం వలన ఆ భాగం యొక్క కణ మరణానికి దారి తీయడంతో మెదడులోని ఒకటి లేదా అనేక భాగాలు దెబ్బతినడం) రెండూ కూడా రక్త ప్రసరణలో ఆకస్మిక కోత కారణంగా ఏర్పడే వైద్యపరమైన అత్యవసర పరిస్థితులు. గుండెకు సరఫరా అయ్యే రక్త ప్రసరణలో అకస్మాత్తుగా అవరోధం ఏర్పడడంతో గుండెపోటు సంభవిస్తే మెదడులో రక్త ప్రసరణలో అకస్మాత్తుగా అంతరాయం ఏర్పడడంతో స్ట్రోక్ సంభవిస్తుంది. బ్రెయిన్ స్ట్రోక్ ఎవరికైనా ఎప్పుడైనా రావచ్చు. **(మిగతా 8వ పేజీలో)**





(7తరువాయి)

అలా సంభవించినప్పుడు, మెదడుకు రక్త ప్రసరణ పూర్తిగా తాత్కాలికంగా నిలిపివేయబడుతుంది. పూర్తి అంతరాయం ఏర్పడిన కొన్ని నిమిషాల్లో, మెదడు కణాలు చనిపోవడం ప్రారంభిస్తాయి. బ్రెయిన్ స్ట్రోక్ అధిగమించడం అనేది తక్షణ వైద్య సహాయంపై ఆధారపడి ఉంటుంది. తక్షణ చికిత్సతో 80 శాతం స్ట్రోక్లను నివారించవచ్చు. ఈ సంఘటన తరువాత ప్రతి క్షణం కూడా రోగి మనుగడకు అత్యంత అమూల్యమైనది.

**పక్షవాతం లేదా పెరాలిసిస్:**

మెదడుకు రక్త ప్రసరణలో అంతరాయం ఏర్పడినప్పుడు స్ట్రోక్ సంభవిస్తుంది. ఇది మెదడును దెబ్బతీయడంతో పాటు కండరాలకు సంకేతాలను పంపకుండా నిరోధించవచ్చు. దీని పర్యవసానంగా పక్షవాతం రావడమే కాక ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కండరాలలో కదలికను కోల్పోయే అవకాశం ఉంటుంది. స్ట్రోక్ కొన్నిసార్లు తాత్కాలిక లేదా శాశ్వత వైకల్యాలకు కూడా కారణమవుతుంది. మెదడులో రక్త ప్రవాహం నిలిచిపోయిన వ్యవధి మరియు దాని కారణంగా ప్రభావితమైన శరీర భాగాన్ని బట్టి సంక్లిష్టతలు ఆధారపడి ఉంటాయి. కండరాల కదలిక కోల్పోవడాన్ని 'పక్షవాతం' అంటారు. శరీరంలోని అన్ని అవయవాలను నియంత్రించడంతో పాటు మెదడు నుండి సంకేతాలను చేరవేసే సమాచార వ్యవస్థగా పనిచేసే నాడీ మండలంలో సమస్య ఏర్పడినప్పుడు అది పక్షవాతానికి కారణమవుతుంది. ఇలాంటి సందర్భాలలో తక్షణ వైద్య చికిత్సతో 80 శాతం స్ట్రోక్లను నివారించవచ్చు. స్ట్రోక్ యొక్క సంకేతాలు మరియు లక్షణాలను త్వరగా గుర్తించడం మరియు ప్రాథమిక లక్షణాలు కనిపించిన 3 గంటలలోపు అత్యవసర చికిత్స అందించడం చాలా ముఖ్యం. పక్షవాతం అనేది స్ట్రోక్ యొక్క అత్యంత సాధారణ సమస్యలలో ఒకటి, ఇది 90 శాతం మంది స్ట్రోక్ రోగులను ప్రభావితం చేస్తుంది. ఇది సాధారణంగా దెబ్బతిన్న మెదడు యొక్క అవతల వైపు శరీర భాగాన్ని ప్రభావితం చేస్తుంది. సాధారణంగా పక్షవాతం ప్రభావం ముఖం (మూతి ఒక వైపు వంకర పోవడం), చెయ్యి, కాలు మరియు ఒక వైపు మొత్తం శరీర భాగంపై ఉంటుంది. స్ట్రోక్ యొక్క ఇతర లక్షణాలలో రోగి మాట్లాడటం లేదా మింగడంలో సమస్య, సరిగ్గా ఆలోచించలేకపోవడం లేదా తార్కికత్వం లోపించడం, స్పృహ కోల్పోవడం, ద్వంద్వ దృష్టి (ఒకే వస్తువు రెండుగా కనిపించడం) లాంటివి ఎదుర్కొనవచ్చు. అయితే సంఘటన సంభవించిన వెంటనే స్పందించి అత్యవసర చికిత్స అందించడం, వైద్యుని సలహా మేరకు మందులు తీసుకోవడంతో పాటు తగిన వ్యాయామాలు చేయడం ద్వారా శరీరంలో కోల్పోయిన కదలికను తిరిగి పొందడమే కాక స్ట్రోక్-ప్రేరిత పక్షవాతం నుండి కోలుకోవడం సాధ్యమవుతుంది. పక్షవాతం వచ్చిన వారిలో 10 శాతం మంది రోగులు దాదాపు పూర్తిగా మరియు 25 శాతం మంది రోగులు కేవలం చిన్నపాటి లోపాలతో మాత్రమే కోలుకుంటున్నారు. 40 శాతం మంది రోగులకు సాధారణం నుండి తీవ్రమైన వైకల్యం సంభవించడం కారణంగా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన పరిస్థితి ఉత్పన్నమవడం మరియు 10 శాతం మంది రోగులకు దీర్ఘకాలిక సంరక్షణ అవసరం ఏర్పడుతుంది.



**నరాల సంబంధిత రుగ్మతలతో జాగ్రత్త:**

ఇటీవలి కాలంలో, పార్శ్వపు తలనొప్పి (మైగ్రేన్), స్ట్రోక్స్, మూర్ఛలు (సీజర్స్) మరియు వివిధ రకాల మెదడులో కణితులు వంటి నరాల సంబంధిత రుగ్మతలు సర్వసాధారణంగా మారాయి. ఈ రుగ్మతలకు కూడా నిపుణుల సంరక్షణ మరియు ఖచ్చితమైన చికిత్స అవసరం. ఉదాహరణకు, భారతదేశంలో ప్రతి సంవత్సరం 40 నుండి 50 వేల మంది మెదడు కణితులతో బాధపడుతున్నారు. అన్ని కణితులు హానికరమైనవి కానప్పటికీ కొన్ని ప్రమాదకరమైనవి. సాధారణ తలనొప్పులు, అనారోగ్యంగా అనిపించడం, వాంతులు కావడం, స్పష్టంగా కనిపించకపోవడం, కదలలేకపోవడం లేదా మూర్ఛలు రావడం వంటి లక్షణాలు కనిపిస్తేబీ వెంటనే న్యూరాలజిస్ట్ లేదా న్యూరో సర్జన్ని సంప్రదించడం చాలా అవసరం. వైద్యశాస్త్రం పురోగమిస్తున్న ఈ కాలంలో కూడా మనం నరాల సంబంధిత సమస్యలను తీవ్రంగా పరిగణించకపోవడం వలన చిన్న సమస్యలు కూడా కాలక్రమేణా తీవ్రమైన అనారోగ్యానికి కారణమవుతున్నాయి. ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా సమయానుసారం మితంగా పౌష్టికాహారం తీసుకోవడం, వ్యాయామం చేయడం, మానసిక ఒత్తిడి లేకుండా జీవించడం, రక్తపోటు మరియు శరీరంలో చక్కర స్థాయి నియంత్రణలో ఉంచుకునేందుకు క్రమం తప్పకుండా వైద్యులను సందర్శిస్తూ అవసరం మేరకు మందులు వాడడం, మెదడు యొక్క రక్త నాళాలను దెబ్బతీసే ధూమపానం, అధిక ఆల్కహాల్కు దూరంగా ఉండడం, సమయానుసారం వైద్య పరీక్షలు చేయించుకోవడం, ప్రత్యేకించి మెదడుకు సంబంధించిన కుటుంబ చరిత్ర ఉంటే, తరచుగా వైద్యున్ని సంప్రదించడం వలన సమస్యను ముందుగానే గుర్తించి ఈ వ్యాధి బారిన పడకుండా ఉండే అవకాశం ఉంటుంది. వీటితో పాటు మెదడు ఆరోగ్యంగా ఉండేందుకు ఉపకరించే పజిల్స్ చేయడం, చదవడం మరియు మేధోపరమైన చర్చలలో పాల్గొనడం వంటి క్రమమైన మానసిక వ్యాయామాలు మెదడును పదునుగా ఉంచడంలో సహాయపడతాయి. రోడ్డు ప్రమాదాలలో అత్యధిక మంది యువతీయువకులు ప్రాణాలు కోల్పోతున్నందున, ప్రత్యేకించి 20 నుంచి 40 సంవత్సరాల వయసు వారు సరైన హెల్మెట్లు ధరించడం మరియు రహదారి నియమాలను పాటించడం వల్ల తలకు అయ్యే గాయాలను నివారించవచ్చు.

**BEFAST మంత్రం:**


BEFAST అనేది స్ట్రోక్ యొక్క హెచ్చరిక సంకేతాలను గుర్తించడంలో ప్రజలకు సహాయపడటానికి ఉపయోగించే సంక్షిప్త రూపం. బి: బ్యాలన్స్ లేదా సంతులనం: శరీరం యొక్క ఎడమ లేదా కుడి వైపు మైకం కమ్ముడం ద్వారా లేదా బలహీనత కారణంగా నడవడానికి ఇబ్బంది పడడం లేదా సంతులనం (బ్యాలన్స్) కోల్పోవడంబీ ఇ: ఐస్ (కళ్ళు): ఒకటి లేదా రెండు కళ్లలో దృష్టి లోపాలు ఏర్పడడం, ద్వంద్వ దృష్టి (ఒకే వస్తువు రెండుగా కనిపించడం) లేదా కంటి చూపు కోల్పోవడం వంటివిబీ ఎఫ్: ఫేస్ (ముఖం): ముఖం ఒకటి లేదా రెండు వైపులా వంకర పోయినట్లు అనిపించడంబీ ఏ: ఆర్మ్ (చేయి): రెండు చేతులలో బలహీనతబీ ఎస్: స్పీచ్ (ప్రసంగం): అస్పష్టంగా మాట్లాడడం లేదా అర్థం లేని పదాలు పలకడం మరియు టి: టైం (సమయం): మెదడుకు సంబంధించి అత్యవసర సమయ సంకేతం - ఇది అత్యవసర సహాయం కోసం ఫోన్ చేయాల్సిన సమయం.

**యేచన్ చంద్ర శేఖర్**
**8885050822**



# ఈమె ఆగ్రహి కాదు అనుగ్రహి

ఈ పుస్తక కర్త పేరు నీలిమ..
ఔరా ఆమె పేరే ఒక కవిత..
నేను అపుడెపుడో నాకు కొన్ని మగపదాలు కావాలని రాశాను..
కానీ ఈమె ఏకంగా మగ గొంతుతోనే ఘర్జించటం నన్ను విస్మయ పరిచింది..
ఎందుకంటే ఇది మగాళ్ళు భయపడుతున్న కాలం..
స్త్రీని పూజించని 'ఈభూమి నామాతృభూమికాదు మగభూమి, మృగభూమీ అని ఎలుగెత్తటానికి నిజపు కుండని బద్దలుకొట్టటానికి ధైర్యం కావాలి...
'కాషాయ కర్కశత్వానికి బలవుతున్న ' అనే వాక్యబంధం సృష్టించటానికి ఎంత సామాజిక నైపుణ్యం ఉండాలి ఈరోజుల్లో..
"గిదేం రాజ్జెం దొరా ఒకటి చెప్పబట్టె ఒకటి చెయ్యబట్టె ఎవడబ్బ సొమ్మని అడిగెటోడు లేకపాయె నాపేరుజెప్పి నాబిడ్డెలకే గోరి కడితివి ' ఇలాంటి వాక్యాల దమ్ముతో దుమ్మురేపగల కలాలు ఇపుడున్నాయా నిజం చెప్పండి..... ఆగ్రహి అని స్వయంగా పేరు పెట్టుకోటానికి కారణమేంటో ఈపాటికి మనకు తెలిసిపోయుండాలి...రాజనీతి శాస్త్రంలో డాక్టరేట్ అయిన ఈ కవయిత్రికి సామాజిక స్పృహ ఎక్కువే.. అందుకే అంతటి ధిక్కారాగ్రహం..
ఈమెపై శ్రీశ్రీ ప్రభావం ఉందని తాటికొండాల నరసింహారావుగారు తన ముందుమాటలో అన్నారు కానీ ఈమెపై ప్రసేన్గారి కవితా ప్రభావం ఉన్నట్టు నాకు అనిపించింది...
' అమ్మలేని నాన్న కవిత ఎంత నచ్చిందో నాకు.. తాటికొండల నరసింహారావుగారిని మన కళ్ళముందు నిలిపారు...
వ్యక్తుల్లో, వర్గాల్లో సమాజంలో ఏం నచ్చదో ఈ కవయిత్రికి స్పష్టంగా తెలుసు...
ఆ నచ్చతనితనంపై ఈమె ఆగ్రహి..
ఏం వొద్దో ఎరుక ఉంది కనుక ఏం కావాలో స్పృహ మెండుగా ఉంది...ఎవరినీ నొప్పించని సున్నిత సంఘాన్ని కవిత్వంలో సృష్టించి కానుకిస్తుంది..కనుక ఈమె అనుగ్రహి... తనే ఆగ్రహి తనే అనుగ్రహి..... నాణానికి రెండువైపులా ఒకే ముఖం వున్న కవి తను,
బిడ్డ తప్పు చేస్తే అమ్మ దెబ్బకొడుతుంది కానీ దూరం చేసుకోదు కొడుకు చేదువైపు అడుగులేస్తుంటే
తీపి మమకారం చూపుతాడు నాన్న అంతేకాని తీపి విలువ తెలియదని విమర్శించడు...
నీలిమ కవిత్వం నిరాలంకారం
తనలోపల అగ్నిగోళం బద్దలౌతున్న ప్రతిసారీ ఆ వాక్యాలకు వాచకాన్ని అందంగా రాసుకుంటుంది
ఎక్కడా పొలమారదు, పొద్దు పొడవదు కానీ తన వాక్యాలు మాత్రం సింధూరాన్ని పులుముకున్న సూరీడై మనలోకి విప్లవాన్ని జొరబడేలా చేస్తాయి...
వాక్యాలే కాదు మాటలూ అంతే ఎంత అందంగా ఉంటాయో
భావోద్వేగాలను ఇంత ఇదిగా రాసుకున్న ఆమె మనసు కూడా ఎంత సున్నితమో కదా...
దాహమైన ప్రతిసారీ ఎడారిని తిట్టడం
వానని ప్రేమించడం అతి మాములు మనుషులు చేసే పని..కానీ నీలిమ కవిత్వం ఎడారిలో వానని కురిపిస్తుంది తడారిన వానను ఎడారిలో ఎండిపోకుండా చూడమంటుంది.. తన దృక్పథం ఏమిటో ఎక్కడా బయటపెట్టని ఈ కవి
సంఘర్షణలపై సమాజ దృక్పథాన్ని బయటపెట్టేందుకు తన కవిత్వాన్ని ఎక్కుపెడుతుంది ..
"బతకడానికి కాస్త మరణం కావాలి అంటూ బతకడానికి ఒక జననం సరిపోదు కాస్త మరణం కూడా కావాలి అంటుంది..."
"నువ్వులేక పువ్వు అలుగుతుందని చెబుతూనే
వచ్చేస్తావు కదూ అంటూ విరహవేదనను విరుపు మాటలని కవిత్వం చేసేస్తుంది..."
"వెళ్లేటప్పుడు దూది పింజల ఆకాశానికి ఊహా మేఘాన్ని కానుకగా




ఇవ్వు అంటుంది"
"ప్రేమించడం కన్నా బాధ్యతగా ప్రేమని పంచడం అది కూడా మనుషులనే కాకుండా ప్రకృతిని ప్రయాణాన్ని పక్షులని సకలకోటి జీవాలని ఒక్కసారి మనసుతో ఆలకిస్తే మరణం కూడా జననమే అంటుంది ఈ అమ్మాయి..."
"మాకొక ఆయుధం కావాలి అంటూ
,"నగరం నడిబొడ్డున ఉవ్వెత్తున లేచే మీ మగాధిపత్య మదమణచటానికి
"మాకొక ఆయుధం కావాలి,అది కన్నతల్లి దుఖాన్ని తుడిస్తే చాలు, చిట్టిచెల్లి ప్రాణాన్ని కాపాడితే చాలు "అంటుంది
ఎంత సున్నితత్వాన్ని పోగేసుకుంది తన ఆగ్రహంలో కూడా ఈ కవికి ఆయుధం కావాలి కానీ ఎవరిని చంపేందుకు, బెదిరించేందుకు ,హింసించేందుకు కాదు,గుండె దుఖాన్ని తీర్చేందుకు కావాలి అంటుంది...

**"ప్రేమ**
**ప్రేమంటే నువ్వు రాలేదని దిగులు**
**ప్రేమంటే నువ్వు రావేమోనని**
**ప్రేమంటే నువ్వు రాలేవేమోనని దిగులు**
**అవును ప్రేమ దిగులుకు పర్యాయపదం అయిపోయిందిప్పుడు..."**

**అమ్మంటే అన్నీ**
**"నేననుకోలేదు కూని రాగం కూడా తీయలేని నేను**
**కోయిలమ్మనవుతానని నీ జోల కోసం**
**నేననుకోలేదు ఓనమాలు కూడా రాని నేను**
**కథలల్లుతానని నీ లాలకోసం..."**

ఈ కవితలో ప్రతి పాదం అద్భుతం
ఈ కవితలో
అమ్మతనాన్ని మించిన దైవం ఇంకొకటి లేదని కవి నమ్మకం ..
మనందరి ఇష్టం కూడా అదే కదా ...
"వానవచ్చేటప్పుడు "
"ఆకాశంలో పొంగే గంగను చూసి
ఒంటిమీద చినిగిన నిక్కరు సగం జారిపోతున్న పిల్లాడొకడు
అన్న సగం రాసి వదిలేసిన
నోట్స్ లో నుండి నాలుగు కాగితాలు చించి కాగితప్పడవలు తయారుచేయడానికి సిద్ధమైపోవాలి "
వానని ప్రేమించనీ ప్రియురాలు ఉండదు
ప్రతి వ్యక్తికి వానొక అల్కెమిస్ట్
ఆ వానను రాయని కవి ఉండడు ...
ఈకవికి వనవచేటప్పుడు ఎలా ఉండాలో రాసుకోవడం కూడా గొప్ప సరదానే అయ్యుంటుంది..

**"గుర్తొస్తావు"**
**డెబ్బయేళ్ళ ఎక్కడ చూసే నువ్వే గుర్తొస్తావు**
**ఎర్రంచు పచ్చ చీరని ఏ డాబా మీద చూసినా నువ్వే గుర్తిస్తావు "**
**అమ్మని కోల్పోయిన బిడ్డలందరు అనుకునే మాటలు ఇవి...**
**అమ్మ దూరమై ఏడాది అయినా తనలో కూసింత చెమ్మైన తగ్గించుకోలేని ఈ కవి హృదయమంతా అమ్మతనమే కదా...**

To be or not to be
"షేక్స్పియర్ మిలియన్ డాలర్ క్వచ్చన్
నాటకం జీవితం కాదు
కానీ జీవితమే నాటకమైన విషాద సందర్భం ఇది"
వెళ్ళనా వద్దా అనే సందిగ్దావస్త ఈ కవిత
ఈ వాక్యాలు ప్రతి అతివకు ఆచరణ యోగ్యమే
చదువు సంస్కారం రెండు ఉన్న మహిళలో ఈ అనుమానాన్ని ఎంత చెప్పినా తక్కువే...
అవమానం భరించలేని ఆడది వేసుకునే మొదటి ప్రశ్న ఈ కవిత..

**న స్త్రీ**
**న ప్రాయం**
**న కాలం**
**న కులం**
**న మతం**
**న ప్రాంతం**
**న స్త్రీ స్వాతంత్ర మర్హతి...**


స్త్రీవేదనని స్త్రీవాదాన్ని నాలుగు మాటల్లో చెప్పగలిగిన ఈ కవి కచ్చితంగా సమాజానికి సాహిత్యానికి తగినంత స్థాయిలో తన పేరుని నిలబెట్టుకుంటుంది...
ఏడుపులు గగ్గోలు పెట్టడం
అన్యాయం జరిగిందని రోడ్డెక్కి అరవాటలు లాంటి పనులు చేసే స్త్రీవాదాన్ని రాయలేదు ఈ కవి
ఒక్కమాటలో స్త్రీ వేదనను కళ్ళకు దృశ్యమానం చేయడం నిజంగా గొప్ప విషయం...

**"వెలిప్రేమ"**
**"మలివయసులోను వెలిప్రేమ నాదంటావ్ "**

అంటరానితనాన్ని ఇంత విభిన్నంగా చెప్పడం ఈ కవికి చాలా సులభం అనుకుంటాను,ఇప్పటికీ అంటరానితనం ఉందా అని ప్రశ్నించకండి
అంటరానితనం అమానుషం అన్న సూక్తులను వల్లించకండి
వెలిప్రేమలే అన్నీ,వ్యక్తిగత అభిప్రాయాలని కులానికి అంటించి రాసుకున్న రాతలే జీవితాలన్నీ
ఈ పుస్తకంలో ఉన్న కవితలన్నీ ఆగ్రహానికి గురైన వ్యక్తి సామాజిక దృక్పథపు సమిష్టి నిర్వచనం...
నీలిమ కవిత్వాన్ని తూచటానికి నా దగ్గర త్రాసు లేదు
కానీ..యాదుంచుకో కవిత మస్తున్నది గానీ గా ముచ్చట గిప్పుడు అవుట్ డేటెడ్
వచనాన్ని అంతర్గతంగా కవిత్వం చేసే తీరు నచ్చింది
ఇంకాస్త పదును పెడితే తన కవిత్వంలో సంఘర్షణల భావోద్వేగాలను అవలీలగా మోయగలదు
ఎవరి పుస్తకంలో అయినా రాసిందంతా కవిత్వం అవ్వదు వచనం పాళ్లు ఎక్కువగా ఉన్నా
తనలోని ఆర్తిని అమ్మతనాన్ని అలసిపోని అతివతనపు ఉద్వేగాలను, ప్రకృతిపై తనకున్న వాత్సల్యాన్ని హాయిగా రాసుకుంది,
ఏదో తెలియని ఉద్వేగం ఈ కవిత్వం చదవగానే మనలో బయల్దేరుతుంది
మొత్తం పుస్తకాన్ని చదివాక,పుస్తకం పక్కనే పెట్టి కళ్ళు మూసుకొని అలా ఆలోచనల్లోకి ఒదిగిపోగానే నీలిమ ఆగ్రహాన్ని మనం మనసారా వింటాము ...
ఈ ఆగ్రహి సంకల్పం అనుగ్రహమవ్వాలని కోరుకుందాం
All the best డాక్టర్ నీలిమ విస్ రావు

**సుభాషిణి తోట**

అల్లరి నరేష్ అంటే అందరికీ ఒకప్పుడు కామెడీ చిత్రాలే గుర్తుకు వచ్చేవి. కానీ ఇప్పుడు అల్లరి నరేష్ అన్ని రకాల పాత్రలను పోషిస్తూ ఆడియెన్స్‌ను మెప్పిస్తున్నాడు. నాంది మూవీ మంచి విజయం సాధించడంతో ఇంకా డిఫరెంట్ పాత్రలను పోషిస్తూ వస్తున్నాడు. నా సామిరంగా చిత్రంలో అందరినీ ఏడ్పించాడు. ఇక ఇప్పుడు అల్లరి నరేష్ బచ్చలమల్లి అంటూ పూర్తిగా డిఫరెంట్ పాత్రను పోషించాడు. మరి ఈ బచ్చలమల్లి ఆడియెన్స్‌ను మెప్పించిందా? లేదా? అన్నది ఓ సారి చూద్దాం.



**కథ**

బచ్చల మల్లి (అల్లరి నరేష్) తన తండ్రి సత్య నారాయణ (బలగం జయరామ్) రెండో కాపురం పెట్టాడన్న కోపంతో మూరు డిగా మారిపోతాడు. అప్పటి వరకు గొప్పగా చదివిన మల్లి ఆ తరువాత చదువు జోలికి కూడా వెళ్లడు. చెడు తిరుగుళ్లు, చెడు సావాలతో నాశనం అవుతుంటాడు. మొరటోడిలా మారిపోతాడు మల్లి. తినడం, తాగడం, పనికి వెళ్లడం, అడ్డొచ్చిన వాళ్లని తన్నుకుంటూ వెళ్లడం. ఇదే మల్లిగాడి దినచర్య. అలాంటి మల్లి జీవితంలోకి కావేరి (అమృతా అయ్యర్) వస్తుంది. ఆమె రాకతో మల్లి కూసింత మారేందుకు ప్రయత్నిస్తాడు. మారుతాడు కూడా. కానీ మళ్లీ మల్లిగాడి జీవితం మొదటికే వస్తుంది. తాగుడుకే అలవాటు పడతాడు. గాడిలో పడ్డ జీవితాన్ని మళ్లీ ఏట్లోకి తోసేసుకుంటాడు. అసలు మల్లి జీవితంలోకి వచ్చిన కావేరి ఏం అవుతుంది? మల్లి జీవితంలో హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీ నారాయణ (రావు రమేష్), గణపతి రాజు (అచ్యుత్ కుమార్) పాత్ర ఏంటి? అన్నది కథ.

తన కోపమే తన శత్రువు అని అంటుంటారు.. మూర త్వంతో కళ్లు మూసుకుపోయిన వాడికి మంచేదో చెడేదో అన్నది తెలియదు. ఎవరైనా చెప్పినా కూడా వినరు. అసలు తెలుసుకునే ప్రయత్నం చేయరు. జీవితం అంతా చేజారిపోయిన తరువాత, అందరినీ కోల్పోయిన తరువాత గానీ తత్త్వం బోధపడదు. ఇదే పాయింట్‌ను బచ్చల మల్లి కథతో దర్శకుడు సుబ్బు చెప్పదల్చుకున్నాడు. ఎవరినైనా సరే వదిలేసుకోవడం తేలికే.. కానీ బంధాన్ని నిలుపుకోవడమే కష్టం అని చెప్పే ప్రయత్నం చేశాడు. కొన్ని తప్పుల్ని సరిదిద్దుకోగలం.. కొన్ని తప్పుల్ని మాత్రం సరిదిద్దుకునేందుకు వీలుండవు. అలాంటి తప్పుల్ని చేసి బచ్చలమల్లి తన జీవితాన్ని, తన చుట్టూ ఉన్న వారి జీవితాన్ని ఎలా నాశనం చేశాడు? అనేది చూపించాడు. జీవితం అన్నాక పట్టూ విడుపులు ఉండాలని రాసిన డైలాగ్ బాగుంటుంది. గుండె కూడా మన రక్తాన్ని పట్టుకుంటుంది.. విడుస్తుంది.. అలా చేయకపోతే మనం చనిపోతాం.. జీవితంలో కూడా అలానే పట్టూ విడుపులు ఉండాలని చెప్పే సీన్ కనువిప్పులా ఉంటుంది.

బచ్చలమల్లి కథలో చాలా చోట్ల కొత్తదనం కనిపించదు. ఊహకందే సీన్లతో అలా అలా సాగుతూ వెళ్తుంది. ఏ ఒక్క సీన్‌లోనూ కొత్తగా జరిగిందే.. కొత్తగా కనిపించిందే అనే సీన్ ఉండదు. ఫస్ట్ హాఫ్ మొత్తం ఆడియెన్స్ ఊహకు అందేలానే సాదాసీదాగా సాగుతుంది. అల్లరి నరేష్ పాత్రను మల్చిన తీరు, నటించిన తీరు మాత్రం కాస్త కొత్తగానే ఉంటుంది. ఇక జాతర సీన్‌లో ఫైటింగ్, తారాజువ్వలు వచ్చే షాట్స్ మాత్రం అదిరిపోతాయి.

సెకండాఫ్‌లో కొన్ని చోట్ల బోరింగ్‌గా అనిపించే సీన్లు ఉంటాయి. ఇందులో విలన్ పాత్ర ఉంటుంది. కానీ అంతగా ప్రభావం చూపించదు. ఎందుకంటే మల్లి కోపం, మూర త్వమే అతనికి పెద్ద శత్రువు కాబట్టి. అలా ఓ బలమైన ప్రతినాయకుడు, ఓ ఘర్షణ అంటూ ఉండదు. కానీ ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్ మాత్రం రొటీన్‌కు భిన్నంగా, ప్రేక్షకుడి ఊహకు అందనట్టుగా ఉంటుంది. రెగ్యులర్ తెలుగు సినిమా ఎండింగ్ మాత్రం ఈ బచ్చలమల్లిలో కనిపించదు. బచ్చలమల్లి తన జీవితంలో కోపం, మూర త్వంలో చేసిన తప్పులన్నీ గుర్తు చేసుకుంటూ.. వాటిని ఒక వేళ అలా చేయకుండా ఉంటే.. జీవితం ఎంత అందంగా ఉండేదో తలుచుకునే సీన్‌తో దర్శకుడు చెప్పదల్చుకున్న సందేశాన్ని చెప్పేశాడు. కట్టలు తెంచుకునే కోపం, నియంత్రణ లేని కోపం, మూర త్వంతో ఏమీ సాధించలేమని మల్లి పాత్రతో దర్శకుడు చెప్పే ప్రయత్నం చేశాడు. ఈ ప్రాసెస్‌లో దర్శకుడు సక్సెస్ అయ్యాడని చెప్పొచ్చు. కానీ ఇంకా కొత్త సీన్లు, ఫస్ట్ హాఫ్‌ను మరింతగా కొత్తగా రాసుకుని ఉంటే బాగుండేదేమో అని అనిపిస్తుంది. ఈ కథను 1985, 95, 2005 అంటూ విడగొట్టుకుని చెప్పిన తీరు, ఆ స్క్రీన్ ప్లే మాత్రం బాగుంటుంది.

**నటీనటులు**

అల్లరి నరేష్‌కు ఇలాంటి రగ్డ్ లుక్, పాత్ర చాలా కొత్త. బచ్చలమల్లి పాత్రలో అల్లరి నరేష్ అద్భుతంగా నటించేశాడు. అచ్చం ఓ మొరటోడ్ని, మూరు డ్ని చూసినట్టుగానే ఉంటుంది. యాక్షన్, ఎమోషన్స్‌లో అల్లరి నరేష్ అదరగొట్టేశాడని చెప్పొచ్చు. ఇక అమృతా అయ్యర్‌కు మంచి పాత్రే దక్కింది. తల్లి పాత్రలో రోహిణి చాలా రొటీన్ అని అనిపిస్తుంది. రావు రమేష్ పాత్రలోని డెప్త్ క్లైమాక్స్‌లో కనిపిస్తుంది. విలన్‌గా అచ్యుత్ కుమార్ అంతగా ఇంపాక్ట్ క్రియేట్ చేయడు. ఇక బచ్చలమల్లి నాన్నగా చాలా చోట్ల బలగం జయరామ్ ఎమోషన్‌గా కనిపిస్తాడు. అంకిత్ కొయ్య, వైవా హర్ష, ప్రసాద్ బెహరా ఇలా అందరూ తమ తమ పాత్రల్లో నటించి మెప్పించేస్తారు.

టెక్నికల్‌గా బచ్చలమల్లి నిరాశపర్చదు. పీరియాడిక్ మూవీ అన్నట్టుగానే ఉంటుంది. విజువల్స్, ఆర్ట్ వర్క్ ఇలా అన్నీ సహజంగానే ఉంటాయి. విశాల్ చంద్రశేఖర్ సంగీతంలోని పాటలు కొన్ని వినసొంపుగానే ఉంటాయి. ఆర్ఆర్ చాలా చోట్ల ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటుంది. నిర్మాతలు పెట్టిన ప్రతీ పైసాను బచ్చలమల్లి తీసుకొచ్చేస్తాడా? అన్నది ముందుందు తెలుస్తుంది.




అడవికి రారాజు సింబా కుమారుడు సింబా కుమారుడైన యువరాజు ముఫాసా కొన్ని పరిస్థితుల కారణంగా తల్లిదండ్రులకు దూరమవుతాడు. అనాథగా మారిన ముఫాసాను టాకా అలియాస్ స్కార్, అతడి తల్లి ఇషే చేరదీస్తే.. తండ్రి ఒబాసీ వ్యతిరేకిస్తాడు. ముఫాసాను ఆదరించి తన సొంత సోదరుడిగా టాకా ప్రేమను కురిపిస్తాడు. టాకా, ముఫాసా మధ్య స్నేహం బలంగా మారుతుంది. అయితే ఒబాసి సామ్రాజ్యంపై శత్రు సేనలు (తెల్ల సింహాలు) దాడి చేస్తారు. ఆ దాడిని తప్పించుకోవడానికి పారిపోవాలని టాకా, ముఫాసాకు ఒబాసి సలహా ఇస్తాడు. "స్విట్జర్లాండ్‌లో చిల్ అవుతోన్న మహేశ్ ఫ్యామిలీ .. జీన్స్ ప్యాంట్‌లో సితారను చూశారా?" సింబాకు ముఫాసా ఎలా దూరమయ్యాడు? రాజ్యాధికారం చేపట్టాల్సిన ముఫాసా అనాథగా ఎలా మారాడు? అనాథగా మారిన ముఫాసాకు ఎదురైన సమస్యలు, అవమానాలు ఎలాంటివి? టాకాతో కలిసి ముఫాసా ఎలాంటి జీవితాన్ని ఆస్వాదించాడు? ఒబాసి రాజ్యంపై దండెత్తిన శత్రువుల బారి నుంచి ముఫాసా, టాకా ఎలా తప్పించుకొన్నారు? బలమైన శత్రువులను ఎదురించి టాకాను ముఫాసా ఎలా కాపాడాడు? శత్రువులతో ముఫాసా ఎలాంటి పోరాటం చేశాడు? శత్రు సైన్యానికి వ్యవిరేకంగా ఇతర జంతువులను ఎలా ఏకం చేశాడు? చివరకు తన కుటుంబాన్ని ముఫాసా చేరుకొన్నాడా? సింబా రాజ్యాధికార పగ్గాలను ముఫాసా చేజిక్కించుకొన్నాడా? అనే ప్రశ్నలకు సమాధానామే ముఫాసా ది లయన్ కింగ్ సినిమా కథ.

సినిమా చరిత్రలో అత్యంత పాపులారిటీ ఉన్న లయన్ కింగ్ ఫ్రాంచైజీలో భాగంగా వచ్చిన ముఫాసా కోసం దర్శకుడు బ్యారీ జెన్‌కిన్స్ అనుసరించిన కథ నేపథ్యం విషయానికి వస్తే.. ఎమోషన్స్‌తో సాగేలా ప్లాన్ చేసుకోవడం ఈ మూవీకి బ్యూటీగా మారింది. రఫికి, కియారా, టిమోన్ తదితర క్యారెక్టర్లతో కథను చెప్పిన విధానం ఆకట్టుకొనేలా ఉంటుంది. ఇక తెలుగు వెర్షన్ కోసం మహేష్ బాబు, బ్రహ్మానందం, ఆలీ, ఆర్‌సీఎం రాజుతో చెప్పిన తెలుగు డైలాగులు సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్‌గా మారాయి. సెకండాఫ్‌లో ముఫాసా తన శత్రువులను ఎదురించి టాకాను కాపాడుకొన్న తీరు సినిమాకు హైలెట్‌గా మారాయి. ఫస్టాఫ్‌లో చాలా స్లోగా సాగడం, అసలు కథలోకి వెళ్లకుండా క్యారెక్టర్లను ఇంట్రడ్యూస్ చేయడానికి తీసుకొన్న సమయం సినిమాను సాగదీసినట్టు అనిపిస్తుంది. "

ఇక తెలుగు వారి హృదయాలకు లయన్ కింగ్ సినిమా ఎంతో చేరువైన చిత్రం. అలాంటి చిత్రానికి మహేశ్ బాబును కనెక్ట్ చేయడంతో సగం సక్సెస్‌ను సాధించారని చెప్పవచ్చు. ఇక మహేశ్ బాబు చెప్పిన డైలాగ్స్ సినిమాకు వేరే లెవెల్. ఎమోషనల్, యాక్షన్ సన్నివేశాల్లో సూపర్ స్టార్ చెప్పిన మాటలు మూవీకి బలంగా మారాయి. బ్రహ్మానందం, ఆలీ కాంబినేషన్‌లో వచ్చే సన్నివేశాలు హాస్యాన్ని పండించాయి. ఆర్సీఎం రాజుతోపాటు ఇతర నటీనటులు చెప్పిన డైలాగ్స్ ఈ సినిమాను తెలుగు వారు ఓన్ చేసుకొనేలా చేసిందని చెప్పవచ్చు.

ముఫాసా ది లయన్ కింగ్ సినిమాకు సాంకేతిక విభాగాల పనితీరు అదనపు ఆకర్షణ. జేమ్స్ లెక్సన్ సినిమాను రిచ్‌గా మార్చింది. గ్రాఫిక్స్, వీఎఫ్ఎక్స్ ఎఫెక్ట్స్ బాగున్నాయి. డావే మెట్జజెర్ మ్యూజిక్ బాగుంది. తెలుగులోకి పాటల అనువాదం చెత్తగా ఉంది. కొన్ని చోట్ల సంభాషణ విషయంలో అనువాదంపై మరికొంత శ్రద్ధ పెట్టి ఉంటే బాగుండేదనపిస్తుంది. తెలుగు నేటివిటీకి దగ్గరగా డైలాగ్స్ ఉంటే మరింత కనెక్ట్ అయ్యేదనిపిస్తుంది. జోయ్ మెక్ మిలాన్ ఎడిటింగ్ బాగుంది. వాల్ట్ డిస్నీ పిక్చర్స్ నిర్మాణ విలువలు బాగున్నాయి.

అడవికి రారాజు సింబా కుమారుడైన ముఫాసా అతి సాధారణ వ్యక్తిగా, అనాథగా మారి.. తన వారసత్వాన్ని, రాజాసాన్ని ఎలా నిలబెట్టుకొన్నాడనేది ముఫాసా ది లయన్ కింగ్ సినిమా కథ. ముఫాసా ది రైజ్‌గా ఈ సినిమాను చెప్పుకోవచ్చు. ఏది ఏమైనా తెలుగు డబ్బింగ్ విషయానికి వస్తే.. మహేష్ బాబు ఈ సినిమా స్టార్ వాల్యూ తీసుకొచ్చారు. రెండున్నర గంటలపాటు ఫ్యామిలీ, పిల్లలు ఎంజాయ్ చేసే అంశాలు చాలానే ఉన్నాయి. థియేట్రికల్ వాల్యూ ఉన్న సినిమా ఇది. ఈ వారాంతంలో థియేటర్‌లో కొత్త అనుభూతిని పొందడానికి అవకాశం ఉన్న సినిమా. ముఫాసా మిమ్మల్ని నిరాశపరచడు.

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి
పద్మజారాణి
91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com



# 22.12.2024 నుంచి 29.12.2024 వరకు



## మేష రాశి
అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

ప్రారంభం విందు వినోదాలతో, ఆహ్లాదకరంగా సంతోషంగా స్నేహితులతో బంధుమిత్రులతో ప్రారంభమవుతుంది. గృహ వాతావరణం ఉత్సాహంగా ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. సంతాన విద్య అభివృద్ధికి సంబంధించిన విషయాలు వింటారు. ఆలోచనలు ఉద్వేగ పూరితంగా ఉన్నప్పటికీ ఫలవంతంగా ఉంటాయి. ఆకస్మిక బహుమానాలు అందుకుంటారు, భాగస్వామ్ కి సంబంధించి కొత్త నిర్ణయాలు ఆశాజనకంగా ఉంటాయి. వారం మధ్యలో అధిక శ్రమ, నూతన బాధ్యతలు, పోటీలలో విజయం కొరకు చేయి ప్రయత్నాలు, పూర్వ రుణాలు చెల్లిస్తారు, బంధుమిత్రుల రాకతో సందడి వాతావరణం. దీర్ఘకాలిక అనారోగ్యాల నుంచి ఉపశమనం పొందుతారు. మీ కుటుంబములోని పెద్దలు తీర్థయాత్రలు చేయడానికి సంకల్పిస్తారు.



## వృషభరాశి
కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

వారం ప్రారంభంలో తల్లి ఆరోగ్య ఆదాయం అభివృద్ధి కరంగా ఉంటుంది. వాహనము కొరకు, గృహ నిర్మాణం కొరకు ప్రయత్నాలు చేస్తారు. విద్యార్థులు విద్యాపరమైన అంశములు మీద శ్రద్ధను పెంచుకోవాలి. వ్యవసాయ అంశములు అనుకూలంగా ఉంటాయి. మిత్రులతో అనుకూలంగా ఉంటుంది. వృత్తిపరంగా దూర ప్రదేశాలలో తోబుట్టువుల కు నూతన అవకాశములు. మీ సహకారం ఉంటుంది వారికి. వారం మధ్యలో స్నేహితులతో అభిప్రాయ బేధం రాకుండా జాగ్రత్త పడాలి. ఎంతోకాలం ఎదురుచూస్తున్న దూర ప్రదేశంలో నుంచి అందుకున్న ఒక వార్త ఆనందాన్నిస్తుంది.విదేశీ ప్రయత్నాలు చేస్తారు. ఉపాసన బలాన్ని పెంచుకోవడానికి చేసే ప్రయత్నాలు కొంతవరకు అనుకూలం గా ఉంటాయి.



## మిధున రాశి
మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో మిత్రుల సహకారం ఆశించిన విధముగా అనుకూలంగా ఉంటుంది ధైర్యము, పరాక్రమం పెరుగుతుంది. నిర్ణయాలు ధైర్యంగా తీసుకుంటారు. ఆదాయము అనుకూలంగా ఉంటుంది. కుటుంబ వాతావరణం సందడిగా ఉంటుంది. దగ్గర ప్రయాణాలు చేస్తారు. వారము మధ్యలో గృహ వాతావరణం, ముఖ్యంగా తల్లి ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటారు. విద్యార్థులు విద్య మీద ఆసక్తి పెంచుకోవాలి. గృహ వాహన సంబంధ అంశములలో చిన్నపాటి రిపేర్లకు మరమ్మతులకు అవకాశం. వృత్తిపరంగా అధిక బాధ్యతలు శ్రమ ఉన్నప్పటికీ మీరు సమయానికి మీ పనిచేసే ఉన్నత అధికారుల ప్రశంసలను పొందుతారు.



## కర్కాటక రాశి
పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. చాలాకాలంగా చూస్తున్న రావలసిన ఆదాయమును అందుకుంటారు. యదార్థవాది బంధు విరోధి అన్నట్లుగా మాట్లాడే మాట నిక్కచ్చిగా ఉండటం వల్ల కొందరు ఇబ్బంది పడే అవకాశం ఉంది. కొన్ని పనులలో ఆటంకాలు ఆలస్యాలు ఉన్నప్పటికీ పట్టుదలగా వెళ్లే ప్రయత్నాలు. మాట విలువ గౌరవం పెరుగుతుంది నూతన వృత్తి కోసం ప్రయత్నం చేసే వారికి చాలా వరకు అనుకూలంగా ఉంటుంది. సంతాన అభివృద్ధి కొరకు కొత్త ప్రయత్నాలు చేస్తారు. వారి కొరకు సమయాన్ని కేటాయిస్తారు. వారం మధ్యలో వ్యక్తుల సహకారం పెరుగుతుంది. నిర్ణయాలు తీసుకుంటారు. వాటిని అమలు చేయడములో చేసే ప్రయత్నాలు అనుకూలంగా ఉంటాయి. ఆ పెద్దల ఆశీస్సులు అనుకూలంగా ఉంటాయి.



## సింహ రాశి
మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభ ఉత్సాహంగా ఉల్లాసంగా ఉంటుంది. మనసులోని కోరికలన్నీ నెరవేర్చుకోవడానికి కృషి చేస్తారు. ఆరోగ్యం బాగుంటుంది. శారీరక శ్రద్ధ, అలంకరణమీద ఆసక్తి పెరుగుతాయి. భాగస్వామితో కలిపి నూతన నిర్ణయాలు తీసుకుంటారు. దూర ప్రయాణానికి సంకల్పం చేస్తారు. ఆ కస్మికమైన ఖర్చులు ఉంటాయి. వ్యక్తిగత సంతోషం కొరకు అధికమైనప్పటికీ ఆనందాన్నిస్తాయి. ఇతరులకు రుణములు ఇస్తారు. సంతానపరమైన అంశములలో అభివృద్ధికి సంబంధించిన విషయాలు ఆలోచన రేకెత్తిస్థాయి. గృహ ఆదాయం బాగుంటుంది. తల్లితర బంధువుల నుంచి రాకపోకలుంటాయి. బహుమానములు అందుకుంటారు. నూతన వాహన కొనుగోలు కొరకు తోబుట్టువులతో సంప్రదిస్తారు.



## కన్యా రాశి
ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభం అధిక ఖర్చులతో మొదలైనప్పటికీ అవి ఉపయోగకరంగా ఉంటాయి. ఆత్మసంతృప్తిని వ్యక్తిగత అభివృద్ధిని కలిగిస్తాయి. ఆధ్యాత్మిక ఆలోచనలతో సంవత్సరాన్ని స్వాగతం పలుకుతారు. కుటుంబంలో భాగస్వామితో అన్యోన్యతను పెంచుకోవడానికి ప్రయత్నాలు చేయాలి. మాట పట్టింపులు లేకుండా, వాగ్వాదములకు చోటు ఇవ్వకుండా ముందుకు సాగాలి. కొత్త వ్యక్తుల పరిచయాలు. లాభాలు వచ్చినప్పటికీ వాటిని దుర్వినియోగము కాకుండా అనుకూలంగా మరల్చుకోవడానికి ప్రయత్నములు చేయాలి. వారము మధ్యలో ప్రతి విషయంలోనూ మానసికంగా ఆందోళన, వైరాగ్యంగా ఆలోచనలు ఉన్నప్పటికీ అధిగమించే ప్రయత్నం చేయాలి. సంతానము అభివృద్ధి కొరకు ఆలోచిస్తారు. వ్యవసాయ సంబంధ అంశములు మీద దృష్టి పెడతారు.



## తులారాశి
చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

సంవత్సరం ప్రారంభం సంతోషంగా శుభవార్తలతో వృత్తిపరమై న అభివృద్ధితో, మొదలవుతుంది. కుటుంబ సభ్యులతో సంతానంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో, చిన్ననాటి స్నేహితుల పలకరింపులతో ఉత్సాహంగా గడుస్తుంది. ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శిస్తారు. తండ్రి నుంచి, దూర ప్రదేశాల నుంచి విలువైన బహుమానాలు అందుకుంటారు. వృత్తి లో గౌరవం, ఆదాయపరమైన పెరుగుదల, ఆశించిన ప్రదేశములకు స్థానచలనమునకు ప్రయత్నాలు అనుకూలంగా ఉండడం ఆనందాన్ని స్థాయి. వారం మధ్యలో వృత్తిపరంగా నూతన బాధ్యతలు ప్రయాణాలు, కొత్త వ్యక్తుల కలయిక, శ్రమ బడలిక ఉన్నప్పటికీ చలాకీగా వాటిని అధిగమిస్తారు. ఆధ్యాత్మిక పుణ్య క్షేత్ర సందర్శనతో, నదీ స్నానాలు, గురువు ఆశీస్సులు తీసుకోవడం,



## వృశ్చిక రాశి
విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో వృత్తిపరంగా అధిక బాధ్యతలు శ్రమ ఉంటాయి. గౌరవం పెరుగుతుంది. ఇతరులకు సహకరిస్తారు. వృత్తిపరంగా ఉన్నత అధికారుల సహకారంతో పనులు నెరవేరుస్తారు. నూతన విషయాలు నేర్చుకుంటారు. సమయమునకు తగిన ఆహార స్వీకరణ అవసరము. భూమికి సంబంధించిన అంశములలో కొంత ఘర్షణాత్మకంగా ఉంటుంది. తోబుట్టువులతో నిదానమవసరం. నూతన బాధ్యతలు అధికముగా ఉండటం వల్ల ఆరోగ్యపరంగా కొంత ఇబ్బంది పడతారు. వారం మధ్యలో ఒక వార్త ఘర్షణతో కూడిన ఆనందాన్నిస్తుంది. మిత్రులతో సన్నిహితులతో కలిసి చర్చిస్తారు. ఆత్మీయుల సహకారంతో కోరుకున్న విషయంలో పనులు ముందుకు సాగుతాయి. భాగస్వామి సంబంధ అంశాలు ఒక్కలికి వస్తాయి. దగ్గరలో ఉన్న పుణ్యక్షేత్రాన్ని సందర్శిస్తారు. వారం చివరిలో ప్రయత్నములు ఉంటాయి.



## ధనస్సు రాశి
మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరాషాఢ 1వ పాదము

వారం ప్రారంభం అధిక ఖర్చులు ఉన్నప్పటికీ, అవి సంతోషాన్ని , ఉపయోగపడ్డాన్ని సూచిస్తున్నాయి. విద్యా పరంగా అభివృద్ధి పరంగా ఉంటుంది. పెద్దలు గురువుల ఆశీస్సులతో ముందుకు సాగుతారు. ఆత్మీయ వ్యక్తుల సహకారం మీకు మనోధైర్యాన్ని ఇస్తుంది. విదేశీ ప్రయత్నం చేయువారికి చాలా వరకు అనుకూలంగా ఉంది. సంతానానికి అభివృద్ధి కరంగా, విదేశీ పరమైన విద్యకి అవకాశంగా సూచనలు ఉన్నాయి. వారం మధ్యలో వృత్తిపరంగా కొంత అధిక శ్రమకు, అపార్థములకు, నూతన బాధ్యతలకు అవకాశము ఉంది. వృత్తిపరమైన వైరాగ్యంతో తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు. వృత్తిపరముగా సంబంధం లేని వ్యక్తుల విమర్శలు చికాకును కలిగిస్తాయి. వాహనములను నడిపేటప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.



## మకర రాశి
ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

వారం ప్రారంభంలో ఆరోగ్యంపై శ్రద్ధ అవసరము. ముఖ్యమైన విషయాలలో ప్రయాణాలలో వాయిదాలకి అవకాశం ఉంది. ప్రయాణాలలో చికాకులు, నూతన వ్యక్తుల పరిచయాలు ఇబ్బంది కలిగించినప్పటికీ ఆత్మ బలముతో వాటిని జయిస్తారు. తోబుట్టువులతో ఆత్మీయులతో విభేదాలు రాకుండా వీలైనంతవరకూ మౌనం పాటించటమేలు. ఆకస్మిక ఖర్చులు అధికంగా ఉంటాయి. వారం మధ్యలో భాగస్వామికి ఆరోగ్యపరంగా శ్రద్ధ తీసుకుంటారు. ఆగిన పనులు ముందుకు సాగుతాయి. గురువులని పెద్దలని కలిసి ఆశీర్వచనం తీసుకుంటారు. ఆధ్యాత్మిక క్షేత్ర పర్యటన ఆనందాన్ని స్తుంది. వారం చివరిలో భాగస్వామ్య వ్యాపారాలలో అనుకూలంగా ఉంటుంది. జీవిత భాగస్వామికి వృత్తిపరమైన అభివృద్ధి.



## కుంభ రాశి
ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో జీవిత భాగస్వామితో అనుకూలమైన చర్చలు చేస్తారు కుటుంబ వార్తలను ఆహ్లాదకరంగా ఉంటుంది కొత్త నిర్ణయాలు తీసుకుంటారు వ్యక్తిగత శ్రద్ధ, రోగనిరో ధక శక్తి పెరుగుతాయి. పాత బాకీలు వసూలు అవుతాయి. పనులలో ఆలస్యాలు ఆటంకాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత విభేదాలు రాకుండా సంయమనం పాటించాలి. ఆత్మీయ సోదర వర్గం సహకారం అనుకూలంగా ఉంటుంది. వారం మధ్యలో ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసుకోవాలి ఆకస్మిక ఖర్చులు చికాకులు కలిగిస్తాయి. దీర్ఘకాలికి పెట్టుబడులు పైన ఆసక్తి ఉండదు. మాటల విషయంలో కంటి విషయంలో జాగ్రత్తలు అవసరం. ఉన్నది ఉన్నట్లు మాట్లాడటం వల్ల ఇతరులు అపార్థం చేసుకునే అవకాశం ఉంది. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. (



## మీనరాశి
పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో సంతానము తో, ఆత్మీయ వ్యక్తుల తో ఆహ్లాదకరంగా గడుపుతారు. రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి. ఉన్నత వ్యక్తులని కలుస్తారు. వారి ఆశీస్సులు తీసుకుంటారు. మీ ఆలోచనలు బాగుంటాయి సృజనాత్మకత బాగుంటుంది. అనుకున్న విషయాలు సత్ఫలితాలు నిస్తాయి. ఇంతకుముందు రుణములు తీసుకున్న వారి చెల్లిస్తారు. వారం మధ్యలో భాగస్వామ్య సంబంధాలు ఇబ్బంది పెట్టకుండా, అపార్థాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వృత్తిపరమైన అంశములలో, సామాజిక సంబంధాలలో వైరాగ్య భావనల అధికంగా ఉంటాయి. వాటిని అధిగమించే ప్రయత్నాలు చేయాలి. భాగస్వామి ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వాగ్వాదములకు దూరంగా ఉండాలి.


అమృత అయ్యర్